
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వరంగల్
శనివారం 15 జూన్ 2024



ఆత్మకూరు మండలం కొత్తగట్టులోని ఓ క్వారీ

అడ్డగోలు తవ్వకాలకు అడ్డుకట్ట!

- ఇక మైనింగ్ లెక్క పక్కా
- క్వారీల్లో తవ్వకాలపై సర్కారు దృష్టి
- రాయల్టీ ఎగవేతదారులపై ఉక్కుపాదం
- డీజీపీఎస్, ఈటీఎస్ సర్వే ద్వారా నిర్ధారణ
- కసరత్తు చేస్తున్న మైనింగ్ అధికారులు
- ఉమ్మడి జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు

హనుమకొండ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలో జరిగే మైనింగ్ అక్రమాలకు సమూలంగా అడ్డుకట్ట వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూనుకున్నది. తవ్వకాలపై ప్రభుత్వానికి రావలినంత రాయల్టీ అందడం లేదు. దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో జరుగుతున్న ఖనిజాల తవ్వకాలపై దృష్టి సారించింది. ఎవరు ఎంత ఖనిజం తవ్వారు? రాయల్టీ ఎంత చెల్లిస్తున్నారనే విషయం పక్కాగా తేల్చాలన్న నిర్ణయానికి వచ్చింది. నిబంధనలకు విరుద్ధంగా లీజు ఒప్పందాలకు విరుద్ధంగా ఖనిజాలు తవ్వి తక్కువ రాయల్టీ చెల్లిస్తున్నవారిని గుర్తించి వారికి నోటీసులు జారీ చేసి మిగిలిన రాయల్టీని ముక్కుపిండి వసూలు వసూలు చేసేందుకు కసరత్తు మొదలు పెట్టింది. ఇందు కోసం ఉమ్మడి జిల్లాలో రాష్ట్రప్రభుత్వం డిఫరేన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం (డీజీపీఎస్), ఎలక్ట్రానిక్ టోటల్ స్టేషన్(ఈటీఎస్) సర్వేలను చేపట్టింది. ఉమ్మడి జిల్లాలో కొద్దిరోజులుగా ఈ సర్వేలు జరుగుతున్నాయి. ఇవి పూర్తికావ డానికి మరికొన్ని రోజులు పట్టవచ్చు. ఉమ్మడి జిల్లాలో లీజు పొంది ఖనిజాలను తువ్వుతున్న గనులు కేవలం 1,272 మాత్రమే ఉన్నాయి. అక్రమ ఖనిజాల తవ్వకాలు జరుగుతున్న గనులు 420పైగానే ఉన్నా యని అంచనా.

హద్దులుదాటి తవ్వకం

లీజు పొందిన గనుల పేరిట చాలా మంది యజమానులు పక్కనే ఉన్న స్థలాల్లో హద్దులు దాటి అక్రమంగా తవ్వకాలు జరుపుతున్నారు. వాటికి రాయల్టీ చెల్లించకుండా విక్రయాలు జరిపి రూ.కోట్లలో సంపాదిస్తున్నారు. మరో పక్క రాజకీయ పలుకుబడిని ఉపయోగించి కొందరు ప్రభుత్వ భూముల్లోనూ ఖనిజాలను తవ్వి విక్రయాలు జరుపుతున్నారు. అక్రమ తవ్వకాలపై అధికారులు పర్యవేక్షణ లేపోవడంతో వ్యవహారం సాఫీగా సాగుతోంది. అధికారులు, క్వారీ యజమానులతో కమ్మక్కై ఖనిజాలను ఇష్టారాజ్యంగా తవ్వుకునేందుకు అవకాశం ఇస్తున్నారు. ఇందుకు పెద్ద మొత్తంలో ముడుపులు చేతులు మారుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలంలోని కొత్తగట్టు గుట్ట అక్రమ మైనింగ్ జరిపిన ఒక స్టోన్ క్రషర్ సంస్థకు గతంలో రూ.12.80కోట్ల భారీ జరిమానాను మైనింగ్ శాఖ విధించడం ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ. వినియోగదారుల మండలి ప్రతినిధులు కొద్ది రోజుల కిందట మైనింగ్ శాఖలో జరుగుతున్న అక్రమాలపై లోకాయుక్తకు ఫిర్యాదు కూడా చేసింది.

సర్వే ద్వారా నిర్ధారణ

కొత్తగా అమల్లోకి వస్తున్న డీజీపీఎస్, ఈటీఎస్ సర్వేల ద్వారా అక్రమ తవ్వకాలకు సమూలంగా కళ్లెం పడుతుంది. ఎంత ఖనిజం తవ్వితే ఆ మేరకు రాయల్టీ చెల్లించాల్సి ఉంటుంది. దీనికి తోడు అక్రమ మైనింగ్‌ను అధికారులు నిరోధించేందుకు మార్గం సుగమం అవుతుంది. మొదట డీజీపీఎస్ సర్వే నిర్వహించి లీజు పొందిన గనిలో ఖనిజాలు తవ్వారా? లేదంటే పక్క స్థలంలో తవ్వారా? అనే విషయంలో నిర్ధారణకు వస్తారు. ఈటీఎస్ సర్వేలో లీజు పొందిన గనిలో ఇప్పటి వరకు ఎన్ని మెట్రిక్ టన్నుల ఖనిజాలు తవ్వారు? రాయల్టీ ఎంత చెల్లించారని క్షేత్రస్థాయిలో సర్వేల ద్వారా తేలుతుంది. వ్యత్యాసాలను బట్టి అధికారులు

మిగతా 8వ పేజీలో..

డీజీపీఎస్, ఈటీఎస్ సర్వేలు జరుగుతున్నాయి..

సాంబశివరావు, అసిస్టెంట్ డైరెక్టర్, మైనింగ్‌శాఖ, హనుమకొండ జిల్లా

జిల్లాలో అన్ని మైనింగ్ క్వారీలకు సంబంధించి డీజీపీఎస్, ఈటీఎస్ సర్వేలే సాగుతున్నాయి. మైనింగ్ విధానంలో ఒక భాగంగా ఈ సర్వే జరుగుతుంది. ఈ సర్వేలకు సంబంధించిన సమాచారాన్ని ఇప్పుడే ఇవ్వడం వీలుకాదు. ఇదొక పెద్ద సుదీర్ఘమైన కసరత్తు. ఇంకా సమయం పడుతుంది. లీజు పొందిన క్వారీల్లో ఖనిజాల తవ్వకాలు ఎక్కడ, ఎంత మేరకు జరుగుతున్నది కచ్చితంగా నిర్ధారించేందుకు ఈ సర్వేలు దోహదపడతాయి. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన సర్వేలో భాగంగా హనుమకొండ జిల్లాలో కూడా సాగుతోంది.

'కొండా' నివాసంలో మంత్రులు..



కొండా సురేఖ, సీతక్క

మంత్రి సురేఖ నివాసంలో ముచ్చటించుకుంటున్న నేతలు

వరంగల్ సిటీ, జూన్ 14: అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు నివాసంలో శుక్రవారం స్పీకర్ సహా పలువురు మంత్రులు, నేతలు సందడి చేశారు. పలువురు రాష్ట్ర మంత్రులు సందడి చేశారు. హనుమకొండ హంటర్‌రోడ్‌లోని ఓ ఫంక్షన్ హాలులో జరిగిన సీఎం ప్రధాన సలహాదారు వేం నరేందర్‌రెడ్డి సోదరుడు వేం పురుషోత్తం రెడ్డి సంవత్సరీక కార్యక్రమానికి హాజరైన స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, సీతక్క, ఎంపీ బలరాం నాయక్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు హాజరయ్యారు. కార్యక్రమం అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మంత్రి సురేఖతో సరదాగా మాట్లాడుతూ 'పొరుగు జిల్లా వాళ్లం వచ్చాం.. ఇంటికి పిలిచి కనీసం చాయ్ ఇవ్వవా అక్కా' అని అనడంతో సురేఖ అందరినీ హనుమకొండలోని తన నివాసానికి తీసుకెళ్లారు. వారికి టీ ఇచ్చి, కొద్దిసేపు సరదాగా ముచ్చటించుకున్నారు. అయితే ఇటీవల మంత్రులు సురేఖ, సీతక్క మధ్య వైరం నడుస్తోందన్న ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో వారిద్దరూ అటు ఫంక్షన్ హాలులో, ఇటు కొండా నివాసంలోరూ పక్క పక్కనే కూర్చుని సరదాగా ముచ్చట్లు చెప్పుకోవడం ఆసక్తిరేపింది.

మంత్రి సురేఖను కలిసిన నీలం మధు

కాంగ్రెస్ నుంచి మెదక్ ఎంపీగా పోటీ చేసి ఓటమి పాలైన నీలం మధు శుక్రవారం హనుమకొండలోని మంత్రి కొండా సురేఖను మర్యాదపూర్వకంగా కలిశారు. సురేఖకు మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉన్న నేపథ్యంలో మధు హనుమకొండకు వచ్చి మంత్రిని కలిసి జిల్లా అభివృద్ధికి సంబంధించిన విషయాలపై చర్చించారు.

కుడా వైస్ చైర్‌పర్సన్‌గా అశ్విని తానాజీ వాకడే



వరంగల్ కార్పొరేషన్, జూన్ 14: కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) వైస్ చైర్‌పర్సన్‌గా అశ్విని తానాజీ వాకడేను నియమిస్తూ శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్‌గా పని చేస్తున్న అశ్విని తానాజీ వాకడే పూర్తిస్థాయి కమిషనర్ విధులతోపాటు కుడాకు వైస్ చైర్‌పర్సన్ హోదాలో పని చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దానకిశోర్ ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం కుడా వైస్ చైర్మన్‌గా జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా పని చేస్తున్నారు. ఎన్నిక కోడ్ రావడంవల్ల పూర్తిస్థాయి వైస్ చైర్మన్‌ను నియమించక పోవడంతో జన గామ కలెక్టర్ రిజ్వాన్ బాషా కొనసాగుతూ వచ్చారు. కోడ్ ఎత్తేయడంతో రాష్ట్ర ప్రభుత్వం బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేకు కుడా వైస్ చైర్‌పర్సన్‌గా పగ్గాలను అప్పగించారు.

ధరణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

భూ పరిపాలన చీఫ్ కమిషనర్ నవీన్ మిట్టల్




వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి , అధికారులు

వరంగల్ కలెక్టరేట్, జూన్ 14: ధరణి పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్‌లతో ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా మిట్టల్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటన కంటే ముందు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించామన్నారు. పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, తహసీల్దార్, రెవెన్యూ డివిజన్ అధికారి, అదనపు కలెక్టర్, కలెక్టర్ స్థాయిలు చొరవ చూపాలని సూచించారు.

అదనపు కలెక్టర్ సంధ్యారాణి మాట్లాడుతూ రెవెన్యూ డివిజన్ అధికారి, తహసీల్దార్ల స్థాయిలో పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను ప్రత్యేక కార్యాచరణతో పరిష్కరిస్తామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ ఏవో శ్రీకాంత్, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

కుంగిన ఏడో బ్లాక్‌లో మరో గేటు ఎత్తివేత



పూర్తిగా పైకెత్తిన 21వ నెంబరు గేటు

- మొత్తం 11గేట్లలో 10గేట్ల ఎత్తివేత పూర్తి
- మేడిగడ్డ బ్యారేజీలో కొనసాగుతున్న 20వ గేటు తొలగింపు పనులు
- ముగిసిన సీఎస్ఎంఆర్ఎస్ బృందం పరీక్షలు

వివరాలు : 7 లో..

ఇన్‌చార్జ్ సీపీగా అభిషేక్ మోహంతి

- శిక్షణ కోసం అంబర్ కిషోర్ ఝా



వరంగల్ క్రైం, జూన్14: వరంగల్ పోలీసు కమిషనరేట్ ఇన్‌చార్జి పోలీస్ కమిషనర్‌గా కరీంనగర్ సీపీ అభిషేక్ మోహంతిని రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం నియమించింది. వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా పదిరోజుల పాటు డిల్లీలో జరిగే శిక్షణ కోసం వెళ్లారు. ఈనెల 24న తిరిగి వచ్చే అవకాశం ఉంది. కాగా, కరీంనగర్ సీపీ అభిషేక్ మోహంతి పదిరోజుల పాటు వరంగల్ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తారు.

కాగా, అంబర్ కిషోర్ ఝా బదిలీ అవుతారనే ప్రచారం ఉంది. శిక్షణా కాలం పూర్తయ్యే పదిరోజుల్లో బదిలీ గురించి తేలుతుంది.

ఇక 'విద్యుత్ ప్రజావాణి'

- ఎన్పీడీసీఎల్‌లో ప్రతీ సోమవారం నిర్వహణ

హనుమకొండ టౌన్, జూన్14: విద్యుత్ వినియోగదారులకు చేరువయ్యే కార్యక్రమంలో భాగంగా వారి ఫిర్యాదులు తీసుకొని సకాలంలో పరిష్కరించేందుకు ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 సర్కిళ్లలో ప్రతీ సోమవారం 'విద్యుత్ ప్రజావాణి' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. ప్రతీ సోమవారం ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు 16 సర్కిళ్ల పరిధిలోని డివిజనల్ ఆఫీస్, సబ్‌డివిజనల్ ఆఫీస్, ఈఆర్వో, సెక్షన్ ఆఫీస్‌లలో, అదే రోజు మధ్యాహ్నం 3 గంటల సాయంత్రం 5 గంటల వరకు సర్కిల్ ఆఫీస్‌లో విద్యుత్ ప్రజావాణి కార్యక్రమం నిర్వహించబడుతుందన్నారు. విద్యుత్ ప్రజావాణిని పటిష్టపరచడంలో భాగంగా సమీక్షలు నిర్వహించి వినియోగదారులు చేసే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించేదిశగా చర్యలు తీసుకోబడుతాయన్నారు. ఇందుకోసం టీజీ ఎన్పీడీసీఎల్‌లోని పోర్టల్‌ను కన్స్యూమర్ రిసెప్షెన్ డెస్క్‌లకు అనుసంధానం చేసి విద్యుత్ ప్రజావాణి అనే మరొక పోర్టల్‌ను ఏర్పాటుచేసి వినియోగదారులకు మరింత చేరువ చేస్తున్నామన్నారు. వినియోగదారుల సమస్యల పరిష్కారానికి వేదికగా విద్యుత్ ప్రజావాణి నిలుస్తుందని సీఎండీ వెల్లడించారు.

మావోయిస్టు దంపతుల లొంగుబాటు

- వివరాలు వెల్లడించిన కరీంనగర్ సీపీ అభిషేక్‌మోహంతి
- రూ.4లక్షల రివార్డు అందజేత



లొంగిపోయిన మావోయిస్టు దంపతులకు రివార్డు డీడీ అందజేస్తున్న సీపీ మోహంతి

కరీంనగర్ క్రైం, జూన్ 14: సీపీఐ(ఎంఎల్) మావోయిస్టు పార్టీకి చెందిన ఏరియా కమిటీ సభ్యులు తిక్క సుష్మిత అలియాస్ చైతె, మడకం దూల అలియాస్ దూల శుక్రవారం పోలీసులకు లొంగిపోయారు. వీరిద్దరు భార్యాభర్తలు. ఈ మేరకు వరంగల్ ఇన్‌చార్జి పోలీస్ కమిషనర్, కరీంనగర్ సీపీ అభిషేక్ మోహంతి కరీంనగర్‌లో విలేకరులకు వివరాలు వెల్లడించారు. సెంట్రల్ కమిటీ మెంబర్, తెలంగాణ రాష్ట్ర కమిటీ ఇన్‌చార్జి వద్ద సుష్మిత సెంట్రల్ కమిటీ స్టాఫ్‌గా, దూల ప్రొటెక్షన్ టీం మెంబర్‌గా పని చేశాడని సీపీ తెలిపారు.

హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం సుదన్‌పల్లి గ్రామానికి చెందిన తిక్క సుష్మిత (27) ఇంటర్మీడియేట్ వరకు చదువుకుంది. ఆమె తండ్రి తిక్క సుధాకర్ మావోయిస్టు సానుభూతి పరుడిగా పనిచేశాడు. తండ్రిని చూసి మావోయిస్టు పార్టీకి ఆకర్షితురాలైన సుష్మిత.. తన చదువు అనంతరం 2016లో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా కోమటిపల్లి గ్రామం అటవీ ప్రాంతంలో బడె చొక్కారావు అలియాస్ దామోదర్ సమక్షంలో మావోయిస్టు పార్టీలో చేరారు. అలాగే ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా పర్స గ్రామానికి చెందిన మడకం దూల ఐదో తరగతి వరకు చదువుకున్నాడు. ఆయన సోదరుడు ఐయేత 2008లో సీపీఐ మావోయిస్టు పార్టీలో చేరాడు. అతడిని చూసి ఆకర్షితుడైన దూల.. 2015లో ఏరియా కమిటీ మెంబర్ అయిన జోగి ప్రోత్సాహంతో మావోయిస్టు పార్టీలో చేరాడు. మావోయిస్టు పార్టీలో చేస్తున్న సమయంలో సుష్మిత, దూల మధ్య పరిచయం ఏర్పడి 2020 మార్చి 30న వివాహం చేసుకున్నారు. తరువాత వివిధ హోదాల్లో మావోయిస్టు పార్టీలో పని చేశారు. మావోయిస్టు సిద్ధాంతాలపై నమ్మకం కోల్పోయి తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన పునరావాస పథకం గురించి తెలుసుకుని ఆకర్షితులై లొంగిపోయారని సీపీ అభిషేక్ మోహంతి తెలిపారు. ఒక్కొక్కరిపై నాలుగు లక్షల రూపాయల రివార్డు ఉందని చెప్పారు. ఆ మొత్తాన్ని మావోయిస్టు దంపతులకు సీపీ బ్యాంకు డీడీ రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో కాజీపేట ఏసీపీ పి.తిరుమల్, హసన్‌పర్తి సీఐ జె.సురేష్ పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం భవన నిర్మాణాలు చేపట్టాలి

బల్దియా కమిషన్ అశ్విన తానాజీ వాకడే



మడికొండలో భవన నిర్మాణ అనుమతులను పరిశీలిస్తున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, జూన్ 14: ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్రేటర్ వరంగల్ పరిధిలో భవన నిర్మాణాలు చేపట్టాలని వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విన తానాజీ వాకడే అధికారులకు సూచించారు. గ్రేటర్ వరంగల్ పరిధిలోని మడికొండలో పర్యటించి అక్కడి భవన నిర్మాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా చట్టంలో చూపించి విధంగా నిబంధనల మేరకు ప్రమాణాల ప్రకారం భవనాలు నిర్మించే కట్టడాలకు మాత్రమే అనుమతులు మంజూరు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



రక్తదాతలను సత్కరిస్తున్న కలెక్టర్ సిక్తాపట్నాయక్

ఒకరి రక్తదానంతో ముగ్గురికి ప్రాణదానం

హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్

సుబేదారి, జూన్ 14 : ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం సుబేదారిలోని రెడ్ క్రాస్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ సిక్తాపట్నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఒకరి రక్తదానంతో ముగ్గురికి ప్రాణదానం చేయవచ్చని అన్నారు. రెడ్ క్రాస్ సొసైటీలోని జనరిక్ మందుల షాపు తలసేమియా సెంటర్‌ను సందర్శించి చిన్నారులతో మాట్లాడి వారి బాగోగులు తెలుసుకున్నారు. తలసేమియా బాధితులకు పండ్లు పంపిణీ చేశారు. హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తలసేమియా సెంటర్‌తో పాటు జనరిక్ మెడికల్ షాపు నిర్వహణలో రాష్ట్రంలోనే ద్వితీయ స్థానంలో ఉందని తెలిపారు. అత్యవసర సమయంలో రెడ్ క్రాస్ సేవలు ముందుంటాయని ప్రాణాలను కాపాడేందుకు తమ రక్తాన్ని దానం చేసిన రక్తదాతలను రక్తదాన శిబిరాలను నిర్వహించిన ఆర్గనైజర్లను ఈ సందర్భంగా కలెక్టర్ అభినందించారు.

కార్యక్రమం అనంతరం ఉత్తమ రక్తదాతలుగా ఎంపికైన వారికి కలెక్టర్, పాలక వర్గం చేతుల మీదుగా ప్రశంసాపత్రం, షీల్డు, శాలువాతో సత్కరించారు. అనంతరం కలెక్టర్‌ను పాలకవర్గం షీల్డు, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణగౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, పాలక వర్గ సభ్యులు పుల్లూరు వేణుగోపాల్, పొట్లపల్లి శ్రీనివాసరావు, డాక్టర్ సీహెచ్. సంధ్యారాణి, బాషెట్టి హరిప్రసాద్, రక్తదాతలు, బ్లడ్ డొనేషన్ క్యాంప్ ఆర్గనైజర్స్, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.



రాంనగర్‌లోని తన నివాసంలో వినతులు స్వీకరిస్తున్న మంత్రి సురేఖ

ఎప్పుడైనా.. ఎక్కడైనా నన్ను కలవొచ్చు

● అటవీ, దేవాదాయ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ

● నివాసంలో ప్రజల నుంచి వినతుల స్వీకరణ

వరంగల్‌సిటీ, జూన్ 14: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యమని, ఎవరైనా.. ఎప్పుడైనా.. ఎక్కడైనా తనను కలవచ్చని అటవీ, దేవాదాయ పర్యావరణశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శుక్రవారం హనుమకొండ రాంనగర్‌లోని తన నివాసంలో తూర్పు నియోజకవర్గంలో నుంచి వచ్చిన ప్రజలకు అందుబాటులో ఉన్నారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. అధికారులకు ఫోన్ చేసి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. మంత్రి మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే ధ్యేయమన్నారు. మంత్రిగా ఉన్న నేపథ్యంలో హైదరాబాద్ లేదా ఇతర జిల్లాల పర్యటనలో ఉన్నప్పుడు నియోజకవర్గానికి చెందిన నాయకులు ప్రజల సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చేలా ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. వరంగల్, హనుమకొండ, హైదరాబాద్‌లోని తన నివాసంలో లేదంటే సెక్రటేరియెట్‌లో కలవవచ్చని తెలిపారు. శుక్రవారం సుమారు 150 వినతులను పరిష్కరించినట్లు తెలిపారు.

గొర్రెలకాపరితో ప్రభుత్వ పథకాలపై ఆరా...

హనుమకొండ రాంనగర్‌లో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం తోటి మంత్రులు, ప్రజలు, నాయకులతో మంత్రి సురేఖ బిజీబిజీగా గడిపారు. సాయంత్రం మంత్రి హైదరాబాద్ బయలుదేరారు. మార్గ మధ్యలో ఓ గొర్రెలకాపరి గొర్రెల మందతో రోడ్డు పక్కన వెళుతుండగా మంత్రి కాన్వాయ్ దిగి అతడి వద్దకు వెళ్లి రెండు చిన్న గొర్రెపిల్లలు ఎత్తుకున్నారు. గొర్రెలకాపరితో ముచ్చటిస్తూ ప్రభుత్వ పథకాలు మీకు, మీ గ్రామస్థులకు చేరుతున్నాయా.. అంటూ నెమ్మదిగా ప్రభుత్వ పథకాలపై ఆరా తీశారు. కొద్దిసేపు మాట్లాడి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

పురుషోత్తం రెడ్డి సేవలు మరువలేనివి



వేం పురుషోత్తం రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రులు, కాంగ్రెస్ నాయకులు

బాలసముద్రం, జూన్ 14: ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు వేం నరేందర్ సోదరుడు వేం పురుషోత్తంరెడ్డి ప్రథమ వర్ధంతిని హనుమకొండలోని సీఎస్‌ఆర్ గార్డెన్‌లో కుటుంబ సభ్యులు శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కొండా సురేఖ, దనసరి అనసూయ (సీతక్క), పొన్నం ప్రభాకర్‌గౌడ్, తెలంగాణ శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, మాజీ ఉప ముఖ్యమంత్రి స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొని పురుషోత్తం రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఆపద్బాంధవులు

అత్యవసర సమయాల్లో డీఆర్‌ఎఫ్ సేవలు భేష్

దయనీయ స్థితిలో సిబ్బంది పరిస్థితి

చాలీచాలని జీతాలతో కాలం వెల్లదీత

బల్దియా కమిషనర్ పట్టించుకోవాలని వేడుకోలు



బల్దియా పరిధిలో సేవలందిస్తున్న డీఆర్‌ఎఫ్ సిబ్బంది

వరంగల్ కార్పొరేషన్, జూన్ 5: వరంగల్ మహానగర పాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్‌ఎఫ్) విపత్తు ప్రతిస్పందన దళం సమస్యల వలయంలో కునారిల్లుతోంది. సిబ్బందికి ప్రభుత్వం నుంచి అందించే కనీస సౌకర్యాలు అందించకపోవడంతో పాటు నెలవారిగా వచ్చే చాలీచాలనీ జీతం సైతం సమయానికి అందకపోవడంతో సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నారు. నగర ప్రజల ప్రాణాలు కాపాడేందుకు తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పనిచేసే డీఆర్‌ఎఫ్ సిబ్బంది సేవలు వెలకట్టలేకుండా ఉన్నా వారిపనికి గుర్తింపు లేదు. సిబ్బందికి పనికి సరిపడా వేతనం లేక ఇబ్బందులు పడుతున్నారు. పెరిగిన ధరలు, మారుతున్న పరిస్థితుల దృష్ట్యా కొంత మేరకు జీతాలు పెరిగితే భాగుంటుందని అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం అన్ని అలవెన్స్‌లు కలుపుకుని రూ. 17,500 మాత్రమే వస్తున్నాయని, కనీసం రూ. 25వేల వరకు జీతం పెంచితే పిల్లల చదువులకు ఉపయోగపడుతాయని విజ్ఞప్తి చేస్తున్నారు.

అయితే ఐదేళ్ల కాలంలో వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 30 మంది డీఆర్‌ఎఫ్ సిబ్బంది మాత్రమే పని చేస్తున్నారు. గ్రేటర్ వరంగల్ పరిధిలోని 66 డివిజన్‌ల పరిధిలో 12లక్షలకు పైచిలుకు జనాభా నివసిస్తున్నారు. కానీ 24 కిలోమీటర్ల దూరం విస్తరించి ఉన్న బల్దియా పరిధిలో విపత్తు జరిగిన సమయంలో ప్రమాదస్థలికి వెళ్లాలంటే సిబ్బందికి ప్రాణసంకటంగా మారుతోంది. మంటల్లో చిక్కుకున్న వారిని సైతం తీసేందుకు వీరినే వినియోగించడం, గ్యారెంటీ లేని వీరి జీవితాలకు కార్పొరేషన్‌పరంగా కనీస బీమా కల్పించకపోవడం బాధిస్తోందంటున్నారు. నీటి ప్రమాదాల్లో మృతిచెంది ముక్కలుగా విడిపోతున్న శరీర భాగాలను వెలికి తీసే వీరి పని సాహసోపేతమైనది.

సాహస కార్యాలు

- గొర్రెకుంటలో హత్యచేసి పడేసిన 9 మృతదేహాలు వెలికితీత.
- హంటర్‌రోడ్డులో వరదలో మునిగిపోయిన ఇద్దరు వృద్ధులు, నలుగురు మహిళలను నీటి ప్రమాదం నుంచి తప్పించారు.
- సమ్మయ్యనగర్‌లో వరదలో చిక్కిన వారిని పడవల సహాయంతో కాపాడారు.
- భద్రకాళి సంతోషిమాత గుడి వెనుక గుండంలో మృతి చెందిన వృద్ధురాలి వెలికితీత.
- కేసీ కెనాల్ ఆటోనగర్ వద్ద రెండు మృతదేహాల వెలికితీత.
- నక్కలపల్లిలో బావిలో పడి ఆత్మహత్య చేసుకున్న మహిళ మృతదేహం వెలికితీత.
- న్యూశాయంపేట చెరువులో మృతదేహం వెలికితీత.
- రంగంపేటలో బావిలో పడిన వృద్ధురాలి మృతదేహం వెలికితీత.
- ఏనుమాముల మార్కెట్ వెనుక ముసలమ్మకుంటలో ఇద్దరి మృతదేహాలు వెలికితీత.
- గాలి వానకు రోడ్డుకు అడ్డంగా పడిపోయిన 452 చెట్లు తొలగింపు.
- 240 అక్రమ కట్టడాలు, నిర్మాణాలు తొలగింపు.

2010లో డీఆర్‌ఎఫ్ విభాగం ఏర్పాటు

ప్రజలు నివసించే ప్రదేశాల్లో విపత్తు జరిగిన సమయంలో అక్కడి పరిస్థితులను అదుపు తెచ్చి ప్రాణనష్టం జరుగకుండా కాపాడేందుకు రాష్ట్ర వ్యాప్తంగా డీఆర్‌ఎఫ్ (విపత్తు ప్రతిస్పందన దళం) బృందాలను గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కమిషనర్‌గా పమేలా సత్పతి పని చేసిన కాలంలో వరంగల్ బల్దియాలో 2019 జూన్ మాసంలో డీఆర్‌ఎఫ్ బృందాలను ఏర్పాటు చేశారు. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ లేకుండా నగరంతో పాటు విలీన గ్రామాల గ్రామ పంచాయతీ కార్యాలయాలకు అనుసంధానంగా పని చేసే దినసరి ఉద్యోగులలో ఆసక్తి ఉన్నవారిని మౌఖిక పరీక్ష ఆధారంగా డీఆర్‌ఎఫ్ విభాగంలో నియమించారు. 30మందితోపాటు ఇద్దరు డ్రైవర్లను నియమించారు. సిబ్బందిని పర్యవేక్షించేందుకు ఇన్‌చార్జి ఉంటారు. కాగా, డీఆర్‌ఎఫ్ సిబ్బంది ఎల్లవేళలా విధులు నిర్వర్తిస్తారు. రోజుకు మూడు షిఫ్టులతో పని చేస్తూ నక్కలగుట్ట వాటర్ ట్యాంక్, బల్దియా ఇండోర్ స్టేడియం వద్ద స్టాండింగ్ డ్యూటీలో ఉంటారు.

అత్యవసర సమయంలో..

బల్దియా పరిధిలో ఎలాంటి విపత్తు జరిగినా టోల్ ఫ్రీ నెంబర్ 18004351980తో పాటు 9701999676 రిస్క్‌కాల్ కావడంతో బల్దియా డీఆర్‌ఎఫ్ సిబ్బందికి అప్రమత్తం చేస్తారు. వీరు రాత్రనక, పగలనక ఘటనా స్థలానికి చేరుకుని పనిలో నిమగ్నమై పోతారు. కిందటేడు వర్షాకాలంలో నగరం నీటమునగడంతో పాటు చాలాచోట్ల ఇళ్లలోకి వరద నీరు చేరుకోగా చాలామంది ప్రాణాలు కాపాడడంతో వీరి కృషి వెలకట్టలేనిది. ఇంకా భద్రకాళి చెరువు మత్తడి పడి చెరువు కట్ట తెగిపోవడంతో వీరు దిగువ ప్రాంతంలో ఉన్న వారిని అప్రమత్తం చేయడంతో పాటు విలువైన వస్తువులను గడ్డకు చేర్చారు. అంతేకాకుండా వర్షాలు, ఫ్లష్, పేలుళ్లు, అగ్నిప్రమాదాలు, నీటి ప్రమాదాలు, రోడ్డు ప్రమాదాలు, చెరువులు, కెనాల్‌లో పడిన మనుషుల మృతదేహాలు, జంతువుల కళేబరాలు తీయడం, గాలి వానకు రోడ్డుకు అడ్డంగా పడి పోయిన చెట్లను తొలగించి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చేయడం వంటి పనులు చేస్తారు. అంతేకాకుండా నగరంలో రోడ్లను ఆక్రమించి నిర్మించిన అక్రమ కట్టడాలు, అక్రమ నిర్మాణాలు, అక్రమ ర్యాంప్‌ల నిర్మాణాలు, అక్రమ వెంచర్‌ల నిర్మాణాలను తొలగించేందుకు డీఆర్‌ఎఫ్ సిబ్బందిని ఉపయోగిస్తున్నారు. అయితే సిబ్బంది కొరత వల్ల ప్రమాదాలు జరిగే ప్రతీ చోటికి వెళ్లడం కష్టంగా ఉందని సిబ్బంది చెప్పుకొస్తున్నారు. 12 లక్షల జనాభాకు కనీసం 150 మంది సిబ్బంది 5 వాహనాలు, 10 మంది డ్రైవర్లు, ఒక పూర్తికాలం సూపరింటెండెంట్ స్థాయి అధికారిని నియమించాలని, దీనిపై కమిషనర్ స్పందించాలని సిబ్బంది వేడుకున్నారు.



మృతదేహాలను వెలికితీస్తున్న డీఆర్‌ఎఫ్ సిబ్బంది (ఫైల్)

బల్దియాలో బదిలీ ప్రకంపనలు

సెక్షన్‌లో ఆరా తీస్తున్న ఉద్యోగులు

వరంగల్ కార్పొరేషన్, జూన్ 14: వరంగల్ బల్దియాలో వివిధ విభాగాల సిబ్బందికి, వింగ్ అధికారులకు బదిలీలు తప్పవనే వార్తలు ఉద్యోగుల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో 'బల్దియాలో బదిలీల గుబులు' అనే వార్త ప్రచురితం కావడం చర్చనీయాంశమైంది. ట్రాన్స్‌ఫర్ అయ్యే సుమారు 126 మంది ఉద్యోగుల్లో తమ పేరు ఉందా? అని బల్దియా ఉన్నతాధికారులు, సి-1 సెక్షన్ సిబ్బంది వద్దకు వెళ్లి రహస్యంగా తెలుసుకున్నారు. ఇంకా టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్, శానిటేషన్, పబ్లిక్ హెల్త్, మలేరియా, హార్టికల్చర్ సిబ్బంది వారి అనుయాయులను ట్రాన్స్‌ఫర్ విభాగం సెక్షన్ అధికారుల వద్దకు పంపించి విచారించినట్లు సమాచారం. ఇంకా కొందరు ఫోన్‌ల ద్వారా బదిలీ ప్రక్రియపై అడిగి తెలుసుకున్నారు.

ప్రజాప్రతినిధుల వద్దకు పరుగులు

బల్దియాలో బదిలీలు జరుగుతాయని తెలిసిన ఉద్యోగులు ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, మంత్రుల వద్దకు పరుగులు తీస్తున్నారు. ఇంకా కొందరు మునిసిపల్ అధికారులను ప్రసన్నం చేసుకుని బదిలీ నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. అయితే ఢిల్లీలో ఉన్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే నగరానికి వచ్చిన తర్వాత సర్వీస్ బుక్ ఆధారంగా బదిలీలు తప్పకుండా జరుగుతాయని కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్‌ఎంఎంఎస్ ఉపకార వేతనానికి విద్యార్థి ఎంపిక



ఐనవోలు, జూన్ 14: ఐనవోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి బండ విజయ్ ఎన్‌ఎంఎంఎస్(జాతీయ స్థాయి)లో ఉపకారవేతనానికి ఎంపికయ్యారు. ఈ యేడు ఫిబ్రవరిలో నిర్వహించిన ఎంపిక పరీక్షలో పాల్గొని ఎంపికైనట్లు ఆ విభాగం ఇన్‌చార్జి ఉపాధ్యాయుడు పి. సత్యనారాయణరావు తెలిపారు. 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ప్రతీ సంవత్సరం రూ.12 వేల చొప్పున రూ.48 వేల ఉపకార వేతనాన్ని పొందనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి విజయ్‌ను హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు అభినందించారు.

అఖిల భారత నృత్యోత్సవంలో ప్రతిభ

కాజీపేట, జూన్ 14: ఒడిషాలోని పూరి జగన్నాథ దేవాలయంలో జరిగిన అఖిల భారత నృత్యోత్సవంలో వివిధ విభాగాల్లో తాళ్లపల్లి పద్మావతి ఒలంపియాడ్ పాఠశాల విద్యార్థులు బహుమతులు సాధించారు. పాఠశాలకు చెందిన ఆశ్రితారెడ్డి గ్రూప్ డ్యాన్స్ కేటగిరిలో ప్రథమ బహుమతి గెలుచుకోగా, డ్యూయెట్ డాన్స్ కేటగిరిలో నిగేషిత ప్రథమ బహుమతి సాధించారు. వీరిని చైర్మన్ తాళ్ల మల్లేశం అభినందించారు.

కుంగిన ఏడో బ్లాక్‌లో మరో గేటు ఎత్తివేత

● మొత్తం 11గేట్లలో 10గేట్ల ఎత్తివేత పూర్తి ● మేడిగడ్డ బ్యారేజీలో కొనసాగుతున్న 20వ గేటు తొలగింపు పనులు ● ముగిసిన సీఎస్ఎంఆర్ఎస్ బృందం పరీక్షలు



పూర్తిగా పైకెత్తిన 21వ నెంబరు గేటు

మహదేవపూర్ రూరల్, జూన్ 14 : కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మహదేవపూర్ మండలంలో కుంగుబాటుకు గురైన మేడిగడ్డ బ్యారేజీ ఏడో బ్లాక్‌లో గేట్ల ఎత్తివేత పనులు చివరి దశకు చేరుకున్నాయి. అందులో భాగంగా శుక్రవారం 21వ నెంబరు గేటును 12.50 మీటర్ల ఎత్తుకు విజయవంతంగా ఎత్తారు. బ్లాక్-7లో మొత్తం 11 గేట్లు ఉండగా శుక్రవారంవరకు 10 గేట్లను ఎత్తివేశారు. కుంగుబాటు ప్రభావం అధికంగా ఉన్న 20వ గేటు ఎత్తడం ఇబ్బందికరంగా మారడంతో గత నెల 25న ఆర్క్‌గ్రౌగింగ్ పద్ధతిన గేటు కట్‌చేసి తొలగించే పనులు ప్రారంభించారు. రెండు రోజుల క్రితమే గేటు కటింగ్ పూర్తయినప్పటికి దాని విడిభాగాల తొలగింపు కోసం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పిల్లర్ల కిందున్న అగాదం పూడ్చివేతలో భాగంగా చేపట్టిన ఇసుక, సిమెంటు గ్రౌటింగ్, షీట్‌ఫైల్స్ అమరిక, సీసీబ్లాకుల పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయి.

గేట్లు ఎత్తారిలా..

తొలుత బ్లాక్-7లోని 11 గేట్లలో 19, 20, 21, 22గేట్లను ఎత్తేందుకు వీలుకాదని.. వీటన్నింటిని తొలగించాలని అధికారులు భావించారు. ఆ తర్వాత 19, 22 గేట్లను ఆటోమాటిక్ పద్ధతిన ఎత్తిన అధికారులు 20, 21 గేట్లను తొలగించాలని నిర్ణయించారు. తాజాగా చేపట్టిన ఇసుక, సిమెంట్ గ్రౌటింగ్ పనులతో పిల్లర్ల కింద గట్టిదనం ఏర్పడటంతో శుక్రవారం కుంగిన పిల్లరు పక్కనే ఉన్న 21వ గేటును సైతం విజయవంతంగా పైకెత్తారు. నెల రోజుల వ్యవధిలో గేట్లు ఎత్తే ప్రక్రియను ఓ కొలిక్కి తీసుకువచ్చారు. గత మే నెల 17న 15వ నెంబరు గేటును ఎత్తగా, జూన్ 6న 16, 17 గేట్లను ఎత్తారు. 8న 22వ గేటును ఎత్తిన అధికారులు తాజాగా గురువారం సాయంత్రం 18, 19 గేట్లను, శుక్రవారం 21వ గేటును ఎత్తారు. దీంతో బ్లాక్-7లో మొత్తం 11 గేట్లకు గాను 10 గేట్లను ఎత్తివేశారు.

ముగిసిన సీఎస్ఎంఆర్ఎస్ బృందం పరీక్షలు

నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ సూచనల మేరకు మేడిగడ్డ బ్యారేజీ కుంగిన ఏడో బ్లాక్‌లో న్యూఢిల్లీకి చెందిన సీఎస్ఎంఆర్ఎస్(సెంట్రల్ సాయిల్ మెటీరియల్ రీసెర్చ్ స్టేషన్) నిపుణుల బృందం ఆధ్వర్యంలో చేపట్టిన టెస్టులు, పలు నమూనాల సేకరణ పనులు శుక్రవారంతో ముగిశాయి. జూన్ 5వ తేదీన మేడిగడ్డ బ్యారేజీలోని బ్లాక్-7లో సీఎస్ఎంఆర్ఎస్‌కు చెందిన హరిదేవ్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల నిపుణుల బృందం భూభౌతిక, మృత్తిక, భూసాంకేతిక పరీక్షలను ప్రారంభించింది. పది రోజుల పాటు బ్లాక్-7లో చేపట్టవలసిన పరీక్షలు, నమూనాలను సేకరించిన బృందం పరీక్షల్లో ప్రధానమైన జియోఫిజికల్, జియోటెక్నికల్, కాంక్రీట్‌పరీక్షలను పూర్తిచేసి శుక్రవారం న్యూఢిల్లీకి వెళ్లిపోయారు. బ్యారేజీ కింద 25 మీటర్ల లోతున ఉన్న మట్టి నమూనాలతో పాటు మరికొన్ని శాంపిల్స్ సేకరణను నిర్మాణ సంస్థతో పాటు ఇంజనీరింగ్ ఆధికారులు సేకరించి న్యూఢిల్లీలోని సీఎస్ఎంఆర్ఎస్ ల్యాబ్‌కు పంపించాలని చెప్పి వెళ్లినట్లు తెలిసింది. సీఎస్ఎంఆర్ఎస్ బృందం చేపట్టిన పరీక్షలు ఇంతటితో పూర్తి కావని, మరో ఐదారు విడతలు బ్యారేజీని పరిశీలించి పరీక్షించనున్నట్లు తెలిసింది.

మూలమలుపులో కలప లారీ బోల్తా

గూడూరులో దుంగలు మీదపడి ఇద్దరి దుర్మరణం ● మృతుల్లో సీఐ గన్‌మెన్, సీఆర్టీ ఉపాధ్యాయుడు



గూడూరులో రాస్తారోకో నిర్వహిస్తున్న మృతుల బంధువులు, ఆదివాసీ సంఘాల నాయకులు



గూడూరు వద్ద లారీబోల్తా పడిన ఘటనలో మృతి చెందిన ధనసరి పాపారావు, చుంచా దేవేందర్

గూడూరు, జూన్ 14: కలపదుంగల లోడుతో వెళుతున్న ఓ లారీ మూలమలుపు వద్ద అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో ఇద్దరు దుర్మరణం పాలైన సంఘటన గూడూరులో శుక్రవారం ఉదయం జరిగింది. మృత్యుశకటంలా వచ్చిన ఆ లారీ రహదారి పక్కన టీ తాగుతున్న ఇద్దరి ప్రాణాలు తీయడం తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఘటనకు సంబంధించి గూడూరు ఎస్ఐ నాగేష్ తెలిపిన వివరాల ప్రకారం. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి జామాయిల్ కలప దుంగల లోడుతో ఓ లారీ మహబూబాబాద్ మీదుగా బలార్షాకు వెళుతోంది. శుక్రవారం ఉదయం గూడూరు మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో మూలమలుపు వద్ద వేగంగా వచ్చిన ఆ లారీ ఆదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో లారీలోని దుంగలు మీదపడి గూడూరు మండలం మట్వాడ శివారు కొంగరిగిద్దకు చెందిన ధనసరి పాపారావు (35), మచ్చర్లకు చెందిన చుంచా దేవేందర్ (34) అక్కడికక్కడే మృతి చెందారు. వీరిలో ధనసరి పాపారావు గూడూరు సీఐ గన్‌మెన్‌గా, చుంచా దేవేందర్ ములుగు జిల్లా రాయినిగూడెం గిరిజన ఆశ్రమ పాఠశాల సీఆర్టీ ఉపాధ్యాయుడుగా విధులు నిర్వహిస్తున్నారు. మానుకోట పట్టణంలో జరిగే పోలీస్ శిక్షణ కార్యక్రమానికి తన ద్విచక్రవాహనంపై ఉదయం కొంగరిగిద్దలోని ఇంటి నుంచి ధనసరి పాపారావు ఠాణాలో ఉన్న బూట్లు, యూనిఫాం కోసమని బయలు దేరి వస్తున్నాడు. స్కూల్‌కు వెళ్లేందుకు మచ్చర్ల వద్ద బస్సుకోసం వేచిచూస్తున్న దేవేందర్‌ను బైక్‌పై ఎక్కించుకుని గూడూరుకు చేరుకున్నారు. వరుసకు అన్నదమ్ములైన వారు బైక్‌ను పక్కన పెట్టి, గూడూరులోని మూలమలుపు బస్టాప్ పక్కనే ఉన్న టీస్టాల్ వద్ద టీ తాగుతున్నారు. 365 జాతీయ రహదారిపై జమాయిల్ కలప దుంగల లోడుతో వచ్చిన లారీ అదుపు తప్పి గూడూరులోని బస్టాండ్ మూలమలుపు వద్ద బోల్తా పడింది. అక్కడే ఉన్న పాపారావు, దేవేందర్‌పై దుంగలు పడడంతో అక్కడికక్కడే వారు మృతి చెందారు.

ఎస్ఐ నగేష్ ఘటన స్థలానికి చేరుకుని, ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్‌కు సమాచారం అందించారు. వెంటనే ఘటన స్థలానికి చేరుకున్న ఎస్పీ దుంగలను తొలగించే సహాయక చర్యలు పర్యవేక్షించారు. స్థానికుల సాయంతో దుంగలను తొలగించి పాపారావు, దేవేందర్‌ను బయటకు తీయగా, అప్పటికే వారు మృతిచెంది ఉండటంతో పోస్టుమార్టం నిమిత్తం గూడూరు మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం అనంతరం ఇద్దరి మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగించారు. సీఐ గన్‌మెన్ ధనసరి పాపారావు కుటుంబసభ్యులను ఎస్పీ పరామర్శించి, ధైర్యం చెప్పారు. తక్షణ సాయంగా రూ.20 వేలు అందించారు. అనంతరం కొంగరిగిద్దలో ప్రభుత్వ అధికార లాంఛనాలతో పాపారావు అంత్యక్రియలను పూర్తి చేశారు. అలాగే మచ్చర్లలో చుంచ దేవేందర్ అంత్యక్రియలు జరిగాయి. అంతక్రియల సమయంలో దేవేందర్ మృతిని తట్టుకోలేక రోదిస్తున్న భార్య భారతి అస్వస్థతకు గురయ్యారు. ఆమెను గూడూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్సనందించారు. ఎస్పీ ఆస్పత్రికి చేరుకుని, భారతిని ధైర్యంగా ఉండాలని చెప్పారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, డీఎస్పీ తిరుపతిరావు పాపారావు, దేవేందర్ మృతదేహాలను సందర్శించి నివాళులర్పించారు. కాగా, రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పాపారావు, దేవేందర్ కుటుంబాలకు న్యాయం చేయాలని కుటుంబసభ్యులు, బంధువులు, గ్రామస్తులు, ఆదివాసీ సంఘాల నాయకులు గూడూరులో ధర్నా నిర్వహించారు. ఎస్సై నగేష్ మృతుల కుటుంబాలకు న్యాయం చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో వారు ఆందోళనను విరమించారు.



మృతదేహాలను పరిశీలిస్తున్న మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్

ఒకే పాఠశాలలో ఇద్దరి విద్యాభ్యాసం

పాపారావు, దేవేందర్ తమ విద్యాభ్యాసాన్ని గూడూరు మండలం దామెరవంచ గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో పూర్తి చేశారు. పాపారావు 2003-04 విద్యాసంవత్సరంలో పదో తరగతి పూర్తి చేయగా, దేవేందర్ 2004-05లో ఎస్సెస్సీ పూర్తి చేశాడు. ఒకేచోట చదువుకున్న ఇరువురు బంధుత్వంతో పాటు మంచి మిత్రులుగా ఉండేవారు. మృత్యువులో కూడా వారి స్నేహబంధం వీడకపోవడం అందరి మనస్సులను కలచివేసింది.

ప్రమాదం నుంచి బయటపడ్డ మరో ముగ్గురు..

గూడూరులో ప్రమాదం జరిగిన సమయంలో టీకొట్టు యాజమాని మౌలానా టీ పొడి తీసుకొచ్చేందుకు కిరాణా షాపునకు వెళ్లగా, మానుకోట పట్టణం గుమ్ము దూరుకు చెందిన మరోవ్యక్తి పొగాకుల పోతరాజు వ్యాపారం చేసుకుంటూ బస్టాండ్ వద్దకు ఉన్న టీస్టాల్ ముందు ఆటో నిలిపాడు. ఆయనకు ఫోన్ రావడంతో పక్కవెళ్లి మాట్లాడుతున్నాడు. ఇంతలోనే కలప దుంగలతో వచ్చిన లారీ ఒక్కసారిగా బోల్తా పడడంతో వారు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. పక్కనే ఉన్న కూరగాయల దుకాణం తీసేందుకు వచ్చి వ్యాపారి సురేష్‌కు కలప దుంగలు తగలడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డారు.



రౌతుగూడెంలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న కొత్తగూడ ఎస్సై దిలీప్

భర్త మరణం తట్టుకోలేక భార్య ఆత్మహత్య

మహబూబాబాద్ జిల్లా రౌతుగూడెంలో ఘటన

కొత్తగూడ (మహబూబాబాద్ జిల్లా), జూన్ 14 : విధి ఆ కుటుంబాన్ని పగపట్టింది. వరుస విషాదాలు ఆ కుటుంబాన్ని వెంటాడుతున్నాయి. రోడ్డు ప్రమాదంలో భర్త మరణించడాన్ని జీర్ణించుకోలేకపోయినా ఆ ఇల్లాలు బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. పది రోజుల వ్యవధిలో జరిగిన ఈ ఘటనలతో ఆ కుటుంబం దుఃఖసాగరంలో మునిగింది. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలోని రౌతుగూడెంలో జరిగింది. ఎస్ఐ దిలీప్ తెలిపిన వివరాల ప్రకారం.

కొత్తగూడ మండలంలోని రౌతుగూడెం గ్రామానికి చెందిన మాలోతు రవికి వరంగల్ జిల్లా సంగెం మండలం తిమ్మాపురానికి చెందిన సరిత (38)తో 18 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి సంతానం లేదు. వ్యవసాయంతో పాటు కూలిపనులు చేసుకొంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఈనెల 5వ తేదీన వరంగల్ జిల్లా సంగెం మండలంలో తమ బంధువు మరణించగా పరామర్శించేదుకు వెళ్లి, తిరిగి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మాలోతు రవి మృతి చెందాడు. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన సరిత గురువారం రాత్రి గ్రామ సమీపంలోని బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఉదయం ఇంట్లో సరిత కనిపించకపోవడంతో కుటుంబసభ్యులు, గ్రామస్థులు చుట్టుపక్కల వెతకగా.. గ్రామశివారు బావిలో సరిత మృతదేహాన్ని కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని, పంచనామా నిర్వహించారు. మృతురాలి సోదరుడు అంగోత్ గణేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని ఎస్ఐ దిలీప్ తెలిపారు. ఇక సరిత చెల్లెలు కూడా పది రోజుల క్రితం మరణించింది. ఇలా వరుస విషాదాలు ఆ కుటుంబాన్ని వెంటాడుతున్నాయని స్థానికులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు.



మాలోతు రవి, సరిత (ఫైల్)



ఆంధ్రజ్యోతి WARANGAL CITY 8

వరంగల్ సిటీ

● వరంగల్ ● ఖిలావరంగల్ ● గీసుగొండ

శనివారం 15 జూన్ 2024

స్వర్ణ దంపతులను కలిసిన మార్నేని

వరంగల్‌సిటీ, జూన్ 14: వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎర్రబెల్లి వరద రాజేశ్వర్‌రావును శుక్రవారం హనుమకొండలోని వారి నివాసంలో మార్నేని రవీందర్‌రావు మధుమతి దంపతులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇటీవల తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్‌గా రవీందర్ ఎంపికవగా, ఈసందర్భంగా వారిని కలిశారు.



స్వర్ణ దంపతులను సన్మానిస్తున్న రవీందర్‌రావు దంపతులు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ టౌన్, జూన్14: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మడికొండ, గోపాలపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో, ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు పెద్దమ్మగడ్డ, యాదవనగర్ సబ్‌స్టేషన్ ఏరియాలో, ఉదయం 8 గంటల నుంచి 10 వరకు మచిలీబజార్ సబ్‌స్టేషన్ ఏరియాలో, ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు కలెక్టరేట్ సబ్‌స్టేషన్ ఏరియా, నక్కలగుట్ట సబ్‌స్టేషన్ పరిధిలోని భవానినగర్, ఇందిరానగర్, ఎన్జీవోస్ కాలనీ రోడ్డులో విద్యుత్ సరఫరా జరగదని డీఈ సాంబరెడ్డి తెలిపారు.

వరంగల్‌లో..

పోచమ్మమైదాన్, ఏనుమాముల సబ్‌స్టేషన్స్ మరమ్మతుల్లో భాగంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సబ్‌స్టేషన్స్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా జరగదని డీఈ మల్లిఖార్జున్ తెలిపారు

డివిజన్లలో పనులు పూర్తి చేయించండి

కమిషనర్‌ను కలిసిన కార్పొరేటర్లు

వరంగల్ కార్పొరేషన్, జూన్ 14: గ్రేటర్ వరంగల్ పరిధిలోని 66 డివిజన్‌లలో చాలా పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వర్షాకాలం వస్తున్న నేపథ్యంలో నిధులు కేటాయించినా కొందరు కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేయడం లేదని కొందరు కార్పొరేటర్లు కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే కార్యాలయంలో కార్పొరేటర్లు కలిసి ముందుగా పుష్పగుచ్ఛాలు అందించి తర్వాత డివిజన్‌లలో నెలకొన్న సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. గత మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ నగరానికి వచ్చి డివిజన్‌ల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించారని, కాంట్రాక్టర్లు కనీసం వందలో 25 శాతం పనులు కూడా చేపట్టలేదన్నారు. ఇంకా తమ మూడేళ్ల పదవీకాలంలో సీఎం ప్రత్యేక ఫండ్ నుంచి ఒక డివిజన్‌కు రూ.1కోటి మాత్రమే వచ్చిందని, గతంలో డివిజన్‌కు పది నుంచి 15 కోట్ల వరకు మంజూరు అయ్యేవని కమిషనర్‌కు విన్నవించారు. వెంటనే నిలిచిపోయిన సీసీ రోడ్లు, డ్రైనేజీల పనులు పూర్తి చేయించాలని కోరారు. కమిషనర్‌ను కలిసిన వారిలో దిడ్డి కుమారస్వామి, మరుపల్లి రవి, బస్వరాజు శిరీష్ శ్రీమాన్, పల్లం పద్మ రవి, బోగి సుదర్శ సురేష్, జక్కుల రజిత వెంకటేశ్వర్లు ఉన్నారు.



కమిషనర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న కార్పొరేటర్లు

సమ్మక్క-సారలమ్మ పూజారికి నివాళి



మల్లయ్య (ఫైల్)

కరీమాబాద్, జూన్ 14: అమ్మవారిపేట సమ్మక్క సారలమ్మ పూజారుల్లో ఒకరైన వడిబాల బియ్యం తీసుకువచ్చే పూజారి తాళ్ల మల్లయ్య (84) గురువారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందగా, శుక్రవారం పలువురు నివాళులర్పించారు. కరీమాబాద్ గుండుబావులు ప్రాంతానికి చెందిన మల్లయ్య అమ్మవారిపేట సమ్మక్క సారలమ్మ జాతర సమయంలో పూజా కృతువులు నిర్వహిస్తున్నారు. నివాళులర్పించిన వారిలో జాతర కమిటీ ఆర్గనైజర్ దాసి రాందేవ్, కోశాధికారి భైరి నాగరాజు, భైరి హరినాథ్, కమిటీ సభ్యులు రామ్మూర్తి, కుమారస్వామి, రాము, పూజారులు శ్యాంసుందర్, జంపయ్య, సంజీవ్, మల్లేశం, మల్లయ్య ఉన్నారు.

ఘనంగా చెగువేరా జయంతి

ఖిలావరంగల్, జూన్ 14: ప్రపంచ విప్లవానికి చేగువేరా స్ఫూర్తి అని ఏఐఎస్ఎఫ్ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ల్యాదళ్ళ శరత్ అన్నారు. శుక్రవారం శివనగర్‌లోని ఎస్సీ బాలుర హాస్టల్‌లో చెగువేరా 96వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ చెగువేరా పేరువింటే సామ్రాజ్యవాదులకు వెన్నులో వణుకు పుడుతుందన్నారు. విప్లవానికి ఎల్లలు లేవని, విప్లవానికి కులం, మతం, భాష, ప్రాంతం తెలియవన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మౌటం శివకుమార్, సంతోష్, మేకల అభిరామ్, ప్రభాస్, రాజు, సాయి పాల్గొన్నారు.

నగరంలో ఆర్టీవో అధికారుల తనిఖీలు

ఖిలావరంగల్, జూన్ 14: ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలు పునఃప్రారంభమై మూడురోజులు కావస్తున్నా ఇప్పటికీ ఫిట్‌నెస్ తీసుకొని పాఠశాల బస్సులపై ఆర్‌టీఏ అధికారులు కొరడా ఝులిపించారు. వరంగల్ జిల్లాలో నేటితో ముగియనున్న ఫిట్‌నెస్ లేని ప్రైవేట్ పాఠశాల బస్సులను ఆర్టీవో అధికారులు తనిఖీలు చేశారు. శుక్రవారం నాయుడుపంపు, వరంగల్ ఖమ్మం రోడ్, గిర్మాజీపేట, కాశిబుగ్గ, బొల్లికుంట, స్తంభంపెల్లి, శంభునిపేట, మామునూరు, ఖిలావరంగల్ తదితర ప్రాంతాల్లో బస్సులను తనిఖీ చేసి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను పరిశీలించారు. వరంగల్ నగరంలోని పలు ప్రాంతాల్లో 2024-25 విద్యాసంవత్సరానికి ఫిట్‌నెస్ లేని వివిధ పాఠశాల బస్సులను వరంగల్ రోడ్డు రవాణా సంస్థ ఎంవీఐ జయపాల్‌రెడ్డి తనిఖీలు చేశారు. మామునూరు సమీపంలోని ఓ పాఠశాల బస్సుకు ఫిట్‌నెస్ లేకపోవడంతో పాఠశాల బస్‌ను సీజ్ చేసి ఆర్టీవో కార్యాలయానికి తరలించారన్నారు.



నగరంలో స్కూల్ వ్యానును తనిఖీ చేస్తున్న ఆర్టీవో అధికారి జయపాల్‌రెడ్డి

భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యేలు

వరంగల్ కల్చరల్, జూన్ 14: చారిత్రక నగరంలో కొలువుదీరిన భద్రకాళి అమ్మవారిని వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ శుక్రవారం దర్శించుకున్నారు. ఎమ్మెల్యేలకు ఆలయ ఈవో శేషు భారతి, ప్రధానార్చకులు భద్రకాళి శేషులు స్వాగతం పలికారు. ముందుగా ఎమ్మెల్యేలు వల్లభ గణపతిని దర్శించుకొని భద్రకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ మహా మండపంలో ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, గండ్ర సత్యనారాయణలకు అమ్మవారి తీర్థ ప్రసాదాలు, ఆశీర్వచనం, శేష వస్త్రాలను అందజేశారు. అలాగే రీజినల్ ఈపీఎఫ్ కమిషనర్ అర్జున్ టుక్రల్ కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. వారికి ఈవో శేషు భారతి, అర్చకులు తీర్థ ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, గండ్ర సత్యనారాయణ

ఇండియా క్రాప్ కమిటీ సమావేశానికి రవీందర్‌రెడ్డి

వరంగల్‌సిటీ, జూన్ 14: కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పంజాబ్ రాష్ట్రం లుథియానా జిల్లా వర్ధమాన్ టెక్స్‌టైల్ ఆవరణలో శుక్రవారం ఇండియా క్రాప్ కమిటీ సమావేశం జరిగింది. దేశంలోని అన్ని రాష్ట్రాలను నుంచి ఎక్స్‌పోర్టర్స్, స్పిన్నింగ్ మిల్లర్స్, వ్యాపార ప్రతినిధులు హాజరయ్యారు. అలాగే సీసీఐ ఆహ్వానం మేరకు తెలంగాణ కాటన్ అసోసియేషన్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా గత సంవత్సరం కాటన్ దిగుబడి ఎంత వచ్చింది, ఎంత కంజమ్షన్ అయ్యింది, ఎక్స్‌పోర్ట్స్, ఇంపోర్ట్స్ ఎంత అయినవి, పంట ఉత్పత్తులు, ఇంటర్నేషనల్ మార్కెట్‌పై చర్చించారు.



లూథియానాలో జరిగిన సమావేశంలో పాల్గొన్న రవీందర్‌రెడ్డి, రమేష్

అడ్డగోలు తవ్వకాలకు అడ్డుకట్ట!

(5వ పేజీ తరువాయి)

సదరు యజమానులకు తవ్విన ఖనిజాలకు రాయల్టీ చెల్లించాలని నోటీసులు జారీ చేసి ఆ మేరకు వసూలు చేస్తారు. దీంతో ప్రభుత్వానికి ప్రస్తుతం వస్తున్న ఆదాయం కన్నా రెట్టింపు సమకూరే అవకాశం ఉందని గనుల శాఖ అధికారులు చెబుతున్నారు.

డీజీపీఎస్, ఈటీఎస్ సర్వే అంటే..

డీజీపీఎస్, ఈటీఎస్ సర్వేలు అనేవి ఒక మెరుగైన, కచ్చితత్వాన్ని అందించే విధానం. గనుల్లో క్వారీలు జరుగుతున్న ప్రాంతాల్లో ఈ సర్వేలను ప్రధానంగా నిర్వహిస్తారు. గనుల శాఖ అధికారులే కాకుండా గనుల శాఖలోని విజిలెన్స్ కూడా ఈ సర్వేలను నిర్వహిస్తుంది. ఈ సర్వేలో భాగంగా డేటా కాడాస్ట్రాల్ మ్యాప్‌లను డిజిటలైజ్ చేస్తారు. భూమి లక్షణాలను విజువలైజ్ చేస్తారు. ఈ సర్వేల ద్వారా విలువైన ప్రాదేశిక సమాచారం అధికారులకు అందుతుంది. డీజీపీఎస్ సర్వే ద్వారా క్వారీ జరుగుతున్న ప్రాంతాన్ని కచ్చితంగా కొలుస్తుంది. సాధారణ జీపీఎస్ 15 మీటర్ల నుంచి 10 సె.మీ. వరకు కచ్చితంగా గుర్తిస్తుంది.

ప్రశాంతంగా బక్రీద్ జరుపుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సంధ్యారాణి

వరంగల్ కలెక్టరేట్, జూన్ 14: నిబంధనల మేరకు ప్రశాంత వాతావరణంలో బక్రీద్‌ను జరుపుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో డీసీపీ రవీందర్, పశుసంవర్ధశాఖ, మునిసిపల్, పంచాయతీ, పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ 17న జరిగే బక్రీద్ వేళ వెటర్నరీ అధికారులు ధ్రువీకరించిన జంతువులను మాత్రమే వినియోగించాలన్నారు. పండగ కోసం వాహనాల్లో తరలించే జంతువులకు అధికారులు జారీ చేసిన ధ్రువీకరణ పత్రాలు ఉండాలని స్పష్టం చేశారు. గోవుల అక్రమ రవాణా జరగకుండా చెక్‌పోస్టులను ఏర్పాటు చేయాలని పోలీసులకు సూచించారు. డీసీపీ రవీందర్ మాట్లాడుతూ జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సమావేశంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి బాలకృష్ణ, జడ్పీ సీఈవో రామిరెడ్డి, జిల్లా అగ్నిమాపక అధికారి భగవాన్‌రెడ్డి, మునిసిపల్ కమిషనర్ జోనా పాల్గొన్నారు.

ఎన్‌సీడబ్ల్యూ కమిటీ జిల్లా కార్యదర్శిగా సుధాకర్

వరంగల్‌సిటీ, జూన్ 14: నగరంలోని 14వ డివిజన్ ఏనుమాములకు ప్రాంతానికి కోగిల సుధాకర్ నేషనల్ కాంగ్రెస్ వర్కర్స్(ఎన్‌సీడబ్ల్యూ) కమిటీ జిల్లా కార్యదర్శిగా నియమితులయ్యారు. శుక్రవారం కమిటీ ఫౌండర్, జాతీయ అధ్యక్షుడు గుల్విందర్ మెహత ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ షబ్బీర్‌అలీ సుధాకర్‌కు నియామకపు ఉత్తర్వులను జారీ చేశారు. సుధాకర్ మాట్లాడుతూ..20 సంవత్సరాలుగా పార్టీలో చురుకైన కార్యకర్తగా పనిచేసినందుకు గుర్తించి ఈ పదవి అప్పగించారని తెలిపారు.

మదర్సా పాఠశాలలో కుక్కర్ పేలి గాయాలు

మట్టెవాడ, జూన్ 14: వరంగల్ మండిబజార్‌లో అరబిక్ బోధించే మదర్సా పాఠశాలలో శుక్రవారం కుక్కర్ పేలి నలుగురు విద్యార్థులకు గాయాలు అయ్యాయి. శుక్రవారం పాఠశాలలో కుక్కర్‌లో పప్పు వండుతున్న క్రమంలో కుక్కర్ పేలడంతో విద్యార్థులు గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులను చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. ప్రస్తుతం గాయపడిన విద్యార్థులు ఎంజీఎంలో చికిత్స పొందుతున్నారు. పాఠశాలను మట్టెవాడ పోలీసులు పరిశీలించారు. అబ్దుల్ రెహమాన్, సోను, షరీఫ్, నౌషద్‌లు గాయపడినట్లు పోలీసులు తెలిపారు. పాఠశాల నిర్వాహకుల నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగినట్లు స్థానికులు అంటున్నారు.

జాతీయ మెరిట్ స్కాలర్‌షిప్‌లకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

సంగెం, జూన్ 14: మండలంలోని గవిచర్ల మోడల్‌స్కూల్ విద్యార్థులు చందన, రిషిత, వర్షిక్ అనే విద్యార్థులు ఇటీవల నిర్వహించిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్) పరీక్షలో ప్రతిభ కనబరిచి జాతీయ స్కాలర్‌షిప్‌లకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రహేమాన్ ముజుఫర్ తెలిపారు. విద్యార్థులను ఏఏపీ చైర్మన్ గోనె రాధిక, ప్రిన్సిపాల్, అధ్యాపకులు శుక్రవారం అభినందించారు. లోహిత జెడ్పీ పాఠశాల విద్యార్థులు కోల సింధూజ, దేవ మేఘన కూడా ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికైనట్లు హెచ్‌ఎం నూకల అంజివర్ధన్‌రెడ్డి తెలిపారు. ఇదే పాఠశాల విద్యార్థి వంశీమోహన్ తయారుచేసిన ఎగ్జిబిట్ రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైనట్లు చెప్పారు. ఎంపీటీసీ దుర్గారావు, ఏఏపీ చైర్మన్ ఆకల దీపిక పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తలకు రూ.18వేల వేతనం చెల్లించాలి

పోచమ్మ మైదాన్, జూన్ 14: ఆశా కార్యకర్తలకు రూ.18వేల పారితోషికం వెంటనే అమలు చేయాలని కోరుతూ శుక్రవారం డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తలు మాట్లాడుతూ ఆశా వర్కర్లకు నిర్వహించే ఎన్ఐఓఎస్ పరీక్ష నుంచి మినహాయింపు ఇవ్వాలని లేదా రాతపూర్వకంగా నిర్వహించాలన్నారు. కంప్యూటర్ ద్వారా ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహిస్తే ఆశా కార్యకర్తలకు అన్యాయం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం హైదరాబాద్‌లోని వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ కార్యాలయం ముందు ధర్నా చేపడుతున్నామని అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, బండారి మంజుల పిలుపునిచ్చారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

శంభునిపేట, జూన్ 14 : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని 42వ డివిజన్ కార్పొరేటర్ గుండు చందనపూర్ణచందర్ అన్నారు. బడిబాటలో భాగంగా శుక్రవారం రంగశాయిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల నుంచి ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన చరిత, వర్షలతోపాటు రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో రజత పతకం సాధించిన జిల్లా జట్టు సభ్యురాలు నవ్యశ్రీలను సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రామకృష్ణారెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ సూర్యకళ, ఉపాధ్యాయులు కుమారస్వామి, సంధ్యశ్రీ, లావణ్య, సుహాసినీ, సుజాత, రాములు, సునీత, ఉమాదేవి, అనిత, శ్రీవాణి పాల్గొన్నారు.



విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందిస్తున్న కార్పొరేటర్

రాష్ట్ర టీఎన్జీవోస్ అధ్యక్ష, కార్యదర్శులను సన్మానించిన జిల్లా టీఎన్జీవోస్ సభ్యులు



రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులను హైదరాబాద్‌లో సన్మానిస్తున్న జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

వరంగల్ చౌరస్తా, జూన్ 14 : టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్‌ను వరంగల్ జిల్లా టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గజ్జెల రాంకిషన్, కార్యదర్శి గాజె వేణుగోపాల్‌లు శుక్రవారం హైదరాబాద్‌లో ఘనంగా సన్మానించారు. ఏకగ్రీవంగా ఎన్నికైన నేపథ్యంలో హైదరాబాద్‌లోని కేంద్ర సంఘం భవనంలో రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులను మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించడం జరిగిందని వేణుగోపాల్, జగదీష్ తెలిపారు. ఉద్యోగులు సమస్యల పరిష్కారానికి టీఎన్జీవోస్ ముందు వరసలో ఉంటుందని ఉద్యోగులందరు కలిసి కట్టుగా పనిచేస్తూ సంఘాన్ని బలోపేతం చేయాలని వారన్నారు. కార్యక్రమంలో కేంద్ర కార్యదర్శి వేముల వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి పాలకుర్తి సదానందం, గద్దల రాజు, దుర్గారావు, చందర్‌రావు, ఉమ్మడి జిల్లా నాయకులు పాల్గొన్నారు.

మాంసం విక్రేతలకు కౌన్సెలింగ్

వరంగల్ చౌరస్తా, జూన్ 14: ఈనెల 17న బక్రీద్ పండుగ సందర్భంగా నగరంలో మాసం విక్రయించే వ్యాపారులు ఆ రోజున పశు సంవర్ధక శాఖ అధికారి అనుమతి ఉన్న పశువులను మాత్రమే వినియోగించాలని ఇంతేజార్‌గంజ్ సీఐ మచ్చ శివకుమార్ సూచించారు. శుక్రవారం పోలీసు స్టేషన్‌లో మాసం విక్రేతలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రభుత్వ వైద్యులు సర్టిఫికెట్ ఇచ్చిన పశువులను మాత్రమే పశువధశాలలో వధించాలన్నారు.

రైతులకు సబ్సిడీపై ఎరువులు అందించాలి

వరంగల్ కలెక్టరేట్, జూన్ 14: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఏకకాలంలో రూ. 2 లక్షల రుణమాఫీ చేసి, విత్తనాలు, పురుగుల మందులను సబ్సిడీపై అందించాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర నాయకుడు చిర్ర సూరి కోరారు. శుక్రవారం వరంగల్ కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సూరి మాట్లాడుతూ రైతులకు విత్తనాలు, ఎరువులు 50శాతం సబ్సిడీతో అందించాలన్నారు. రూ. 2లక్షల రుణమాఫీ చేస్తానని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు. రైతు భరోసా పూర్తి స్థాయిలో ఇవ్వకపోవడం సరికాదన్నారు. పంటల బీమా పథకాన్ని బ్యాంకు అప్పుతో సంబంధం లేకుండా ప్రభుత్వమే ప్రీమియం చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకుడు అర్షం అశోక్, దార లింగయ్య, మైదం పాణి, పైడి రవి, మోహన్, సతీష్, అంకూస్, శివ తదితరులు పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్ సంధ్యారాణికి వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

ఉత్సాహంగా ప్రెస్‌క్లబ్ స్పోర్ట్స్‌మీట్

వరంగల్ స్పోర్ట్స్, జూన్ 14: గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పోర్ట్స్ మీట్ - 2024 ఉత్సాహంగా జరుగుతోంది. రెండురోజులుగా హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో క్రికెట్ పోటీలు జరుగుతుండగా.. శుక్రవారం పోటీలను కాజీపేట ఏసీపీ తిరుమల్‌రావు ప్రారంభించారు. ఈ క్రమంలో ప్రాణహిత వర్సెస్ హనుమకొండ టైగర్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో హనుమకొండ టైగర్స్ జట్టు 117పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న హనుమకొండ టైగర్స్ నిర్ణీత 12ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 192 భారీ స్కోర్‌ను సాధించగా ఓపెనర్ మైదం సుధాకర్ 41 బంతుల్లో 111 అత్యధిక పరుగులు సాధించి నాటౌట్‌గా నిలిచారు. అలాగే మూడో బ్యాట్స్‌మన్‌గా దిగిన పులి శివ 42 పరుగులు సాధించారు. ఆ తర్వాత బ్యాటింగ్ చేసిన ప్రాణహిత జట్టు 12ఓవర్లలో 7వికెట్లు నష్టపోయి 75 పరుగులకు కుప్పకూలింది. అదే విధంగా నమస్తే తెలంగాణ డెస్క్ వర్సెస్ లగాన్ జట్ల మధ్య జరిగిన పోరులో లగాన్ జట్టు నమస్తే తెలంగాణ డెస్క్ జట్టుపై 10వికెట్ల తేడాతో భారీ విజయం సాధించింది. యంగ్ ఎలక్ట్రానిక్ మీడియా టీం వర్సెస్ వరంగల్ రాక్స్ మధ్య జరిగిన పోరులో యంగ్ ఎలక్ట్రానిక్ మీడియా జట్టు 33పరుగుల తేడాతో విజయకేతనం ఎగురవేసింది ఈ మ్యాచ్‌లో తిరుపతి అర్ధ శతకం సాధించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. ఇక వరంగల్ ఈస్ట్ డ్రాగన్స్ వర్సెస్ సాక్షి డెస్క్ జట్ల మధ్య జరిగిన పోటీలో సాక్షి డెస్క్ విజయం సాధించింది. అలాగే హనుమకొండ బాలసముద్రంలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన చెస్, క్యారం పోటీలను మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వార్తాసేకరణలో నిత్యం బిజీబిజీగా ఉండే జర్నలిస్టులకు క్రీడలు ఉత్సాహాన్ని, ఉపశమనాన్ని కలిగిస్తాయన్నారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు మాట్లాడుతూ ఇలాంటి క్రీడా పోటీల ద్వారా జర్నలిస్టులకు మానసిక ప్రశాంతత దొరుకుతుందని, ఈ క్రీడాపోటీలను మరో మూడు రోజుల పాటు కొనసాగిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, బాధ్యులు, క్రీడా కమిటీల ఇన్‌చార్జ్‌లు, బ్యూరో ఇన్‌చార్జ్‌లు, డెస్క్ జర్నలిస్టులు, సీనియర్ జర్నలిస్టులు, వివిధ జర్నలిస్టు అసోసియేషన్‌ల ప్రతినిధులు పాల్గొన్నారు.



41బంతుల్లో 111 పరుగులు సాధించిన మైదం సుధాకర్



క్రికెట్ మ్యాచ్‌ను ప్రారంభిస్తున్న కాజీపేట ఏసీపీ తీరుమల్‌రావు



చెస్‌ను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్

గడ్డివాము దహనం చేసిన ఆగంతకులు

ప్రాణహాని ఉందని బాధితుడి ఫిర్యాదు

వర్ధన్నపేట రూరల్, జూన్ 14 : గుర్తుతెలియని ఆగంతకులు నిప్పంటించడంతో గడ్డివాము దగ్ధమైన సంఘటన మండలంలోని కొత్తపెల్లిలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. బాధితుడు దామెరగాని దేవరాజు కథనం ప్రకారం... కొత్తపెల్లి గ్రామ శివారులో దామెరగాని దేవరాజు తన వ్యవసాయ క్షేత్రంలో పండించిన వరిపంట గడ్డివాములను అక్కడే నిల్వ చేసుకున్నాడు. పశువుల మేతకోసం దాచిఉంచిన 710మోపుల గడ్డిని ఆగంతకులు రాత్రి వేళలో నాలుగు వైపుల నిప్పంటించడంతో మంటలు అంటుకుని గడ్డిదగ్ధమైంది. విషయం తెలుసుకున్న రైతు వెంటనే ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించాడు. దీంతో ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. శుక్రవారం బాధితుడు దేవరాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వ్యవసాయ పనులతో పాటు పాల వ్యాపారం చేసుకునే తనకు గుర్తు తెలియని వ్యక్తుల నుంచి ప్రాణహాని ఉందని పోలీసులకు తెలిపాడు.

నల్లమట్టి తరలింపుపై గ్రామస్థుల ఆందోళన



రైతులను నిలువరిస్తున్న ఎస్ఐ ప్రవీణ్‌కుమార్

వర్ధన్నపేట, జూన్ 14 : నల్లమట్టిని తరలించేందుకు ఓ ఇటుక బట్టీల వ్యాపారి లారీలు, హిటాచి తీసుకురాగా, ఈ ప్రాంత రైతులు అడ్డుకుని నిరసన వ్యక్తం చేసిన సంఘటన వర్ధన్నపేట పట్టణ శివారులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. శుక్రవారం వర్ధన్నపేట పట్టణ పరిధిలోని అక్కకుంట నుంచి నల్లమట్టిని తరలించడానికి లారీలు వచ్చాయి. ఈ ప్రాంతంలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన రైతులు నల్లమట్టిని గ్రామ సభ తీర్మానం లేకుండా ఎలా తరలిస్తారని నిరసన వ్యక్తం చేసి అడ్డుకున్నారు. దీంతో గ్రామస్థులు, దళారులు, నల్లమట్టిని తరలించేందుకు వచ్చిన వారి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. ఈ సమాచారం తెలుసుకున్న వర్ధన్నపేట ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ మట్టిని తరలించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, వారిని అడ్డుకోవడం తగదని, లేనిపక్షంలో కేసులు నమోదుచేస్తామని హెచ్చరించారు. దీంతో తాత్కాలికంగా సద్దుమణిగింది.

నీటిపారుదల శాఖ అత్యుత్సాహం..

నల్లమట్టికి ఇటుకలను తయారు చేయడానికి ఈ ప్రాంతంలోని చెరువులు, కుంటల్లో అనుకూలంగా ఉండడానికి తోడు నగరానికి సమీపంలో ఉండడం కలిసివచ్చింది. ఈ కుంట మరమ్మతులు మిషన్ కాకతీయలో చేపట్టగా నామమాత్రపు పనులు చేసిన కాంట్రాక్టర్, నీటిపారుదల శాఖ అధికారులు కుమ్మక్కై అందినంత దండుకున్నారని ఆయకట్టుదారులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదు. ఈ కుంట తూము మరమ్మతులు సరిగా చేయకపోవడంతో గత ఐదేళ్లుగా తూములో నుంచి నీరు బయటకు రాకపోవడంతో ఆయకట్టు రైతులు కుంటకు మోటర్లు పెట్టి పంటలు పండించుకుంటున్నారు.

అందరి 'హస్తం' ...

గతఏడాది ఇదే అక్కకుంటలో నాటి అధికార, ప్రతిపక్షపార్టీల ముఖ్య నాయకులు మట్టిని తరలించేవారితో కుమ్మక్కై లక్షలాది రూపాయలు దండుకున్నారని ఆయకట్టు రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు.ఈ ఏడాది సైతం అదేరీతిలో చేయడానికి ప్రణాళికలు తయారు చేసుకుని నల్లమట్టిని తరలించేందుకు చేసిన ప్రయత్నాలు రైతులు అడ్డుకోవడంతో నిలిచిపోయాయి. ప్రస్తుతం నల్లమట్టిని తరలించే వ్యక్తులు తమకు అధికార పార్టీ అంగబలం ఉందని భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు సమాచారం.

అనుమతుల్లోనూ అతి తెలివి..

నల్లమట్టిని తరలించేందుకు ప్రభుత్వానికి దరఖాస్తుచేసుకున్న వ్యక్తి రితిక దేవేందర్ తనది వర్ధన్నపేటఅని నీటిపారుదలశాఖ నుంచి అనుమతి తీసుకున్నారని కానీ, ఆయన స్థానికుడుకాదని ఇతర జిల్లాలకు చెందిన వ్యక్తని అంబేద్కర్‌నగర్ వాసులు చెబుతున్నారు. ఈయనకు అధికారపార్టీ మద్దతు ఇవ్వడంతోనే స్థానికులకు సమాచారం లేకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వానాకాలం ప్రణాళిక సిద్ధం



తిమ్మంపేటలో తొలకరి వర్షంతో పత్తి విత్తనాలు పెడుతున్న కూలీలు

తొలకరి వర్షాలతో రైతులు వ్యవసాయ పనులకు శ్రీకారం

డివిజన్ వ్యాప్తంగా 1,37,824ఎకరాలలో పంటల సాగు

దుగ్గొండి, జూన్ 14 : ఖరీఫ్ ప్రణాళిక సిద్ధంకావడంతో పాటు తొలకరి వర్షాలు కురియడంతో వ్యవసాయ పనులకు రైతులు శ్రీకారం చుట్టారు. వేసవి కాలంలో దుక్కులు దున్నుకొని పొదను చేసుకున్న రైతులు జూన్ నెలలో తొలకరి వర్షాలు పడగా పంటల సాగును ప్రారంభించారు. దీంతో రైతులు, కూలీలు బీజీ బీజీగా పనుల్లో నిమగ్నమయ్యారు. డివిజన్‌లోని ఆరు మండలాలైన నెక్కొండ, దుగ్గొండి, చెన్నారావుపేట, నల్లబెల్లి, ఖానాపురం, నర్సంపేట మండలాలలో వరి, మొక్కజొన్న, పత్తి పంటలు 1,37 824 ఎకరాలలలో పంటలు సాగుకు అధికారులు ప్రణాళికలు సిద్ధంచేశారు. వరి 63, 417 ఎకరాలు, మొక్కజొన్న 17,019 ఎకరాలు, 57,388 ఎకరాలలో పత్తి పంటకు సాగుకు రైతులు పనులు ప్రారంభించారు.

డివిజన్ వ్యాప్తంగా పంట సాగు వివరాలు

డివిజన్ మండలాలైన చెన్నారావుపేటలో 8,393 ఎకరాలలో వరిపంట, 2,323 ఎకరాలలో మొక్కజొన్న, 10,618 ఎకరాలు పత్తి పంట, దుగ్గొండిలో 5,105 ఎకరాలు వరి పంట, 8,612 ఎకరాలో మొక్కజొన్న, 12,689 ఎకరాలలో పత్తి పంట, ఖానాపురంలో 16,910 ఎకరాలలో వరి పంట, 1495 ఎకరాలలో మొక్కజొన్న, 2572 ఎకరాలలో పత్తి పంట,నల్లబెల్లిలో 10 217 ఎకరాలలో వరి పంట, 1,134 ఎకరాలలో మొక్కజొన్న పంట, 11,234 ఎకరాలలో పత్తి పంట, నర్సంపేటలో 10,695 ఎకరాలలో వరి పంట, 2,053 ఎకరాలలో మొక్కజొన్న పంట, 7,138 ఎకరాలలో పత్తి పంట నెక్కొండలో 12,097 ఎకరాలలో వరి పంట, 1,402 ఎకరాలలో మొక్కజొన్న, 13,137 ఎకరాలలో పత్తి పంట సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నట్లు అధికారులు ప్రణాళికలు తయారు చేశారు. పంటల సాగుకు రైతులు పంట భూముల్లో పనులకు శ్రీకారం చుట్టారు.

మొక్కజొన్న సాగు పెరిగింది

మొక్కజొన్న పంటకు గతంలో ధర తక్కువగా పలుకగా రైతులు సాగుకు పెద్దగా మొగ్గు చూపలేదు. మొక్కజొన్న పంట క్వింటాల్‌కు రూ.2 వేలకు పైగా ధర ఉండడంతో పత్తి పంట సాగు తగ్గించి మొక్కజొన్న పంట సాగుకు ఎక్కువ మంది రైతులు ముగ్గు చూపుతున్నట్లు రైతులు తెలిపారు. గత ఏడాది ఖరీఫ్‌లో 8,257 ఎకరాలు మొక్కజొన్న పంట సాగుకు మొగ్గు చూపగా, ఈ ఏడాది 17,019 ఎకరాల సాగు సాగవుతున్నట్లు రైతులు అధికారులు అంచనా వేశారు.

నాణ్యమైన విత్తనాలు ఎంపిక చేసుకోవాలి

చిలువేరు దయాకర్, ఏవో, దుగ్గొండి



ఖరీఫ్ పంట సాగుకు నాణ్యమైన విత్తనాలు ఎంపిక చేసుకోవాలి. విత్తన షాపుల్లో విత్తనాలు కొనుగోలు చేసినపుడు రశీదు తీసుకోవాలి. దుక్కులు లోతుగా దున్నుకొని పంట భూముల్లో విత్తనాలు విత్తాలి, సాగు చేసిన తర్వాత వ్యవసాయ అధికారులు సలహా సూచనలు పాటించాలి. తెగుళ్ల తదితర వాటి నివారణకు తగు మందులు పిచికారి చేయాలి.

అన్నిదానాలలో కెల్లా రక్తదానం గొప్పది



రాజశేఖర్‌ను సన్మానిస్తున్న డాక్టర్లు, నాయకులు, మంత్రి పొన్నం ప్రభాకర్‌చే అవార్డు అందుకుంటున్న రాజు, గవర్నర్ రాధాకృష్ణ, మంత్రి పొన్నం చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న నరేందర్

నర్సంపేట, జూన్ 14 : అన్ని దానాలలో కెల్లా రక్తదానం గొప్పదని జిల్లా హెడ్‌క్వార్టర్స్ హాస్పిటల్స్ సూపరింటెండెంట్ డాక్టర్ గోపాల్, జిల్లా ఆస్పత్రి సూరింటెండెంట్ డాక్టర్ మనోజ్‌లాల్ అన్నారు. సంఘమిత్రయూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా ఆస్పత్రిలో శుక్రవారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని వారు ప్రారంభించారు. రక్తదాన శిబిరంలో 30యూనిట్ల రక్తాన్ని సేకరించి జిల్లా ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్‌కు అందించామని సంఘమిత్ర వ్యవస్థాపక అధ్యక్షుడు గొంగళ్ల అశోక్ అన్నారు. కార్యక్రమంలో తోటరవి, అలవాల తేజస్విని, అరుణ్ కుమార్, వరంగల్‌కానిస్టేబుల్ కన్నెరవి, ప్రశాంత్, రక్తదాతలు పాల్గొన్నారు.

ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి తక్కళ్ళపల్లి రవీందర్‌రావు అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా శుక్రవారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఆయనతో పాటు కొంత మంది కాంగ్రెస్ నాయకులు రక్తదానం చేశారు. 18ఏళ్ళ నుంచి 60ఏళ్ళ వారు రక్తదానం చేయవచ్చన్నారు. రక్తదాతలకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో మునిసిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్యగౌడ్, డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఓ ప్రకాశ్, జిల్లా వైద్య విధాన పరిషత్ అధికారి డాక్టర్ గోపాల్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మనోజ్‌లాల్, డాక్టర్లు విరిన్, స్నేహ, కాంగ్రెస్ పార్టీ నాయకులు జయ్యారపు అఖిల్, కటారి ఉత్తమ్‌కుమార్, దండెం రతన్‌కుమార్, రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

• రక్తదాతలకు అవార్డులు

నర్సంపేట పట్టణానికి చెందిన ప్రజా సేవకుడు, ఏఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించే ఎర్రబోయిన రాజశేఖర్ 25సార్లు రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో శుక్రవారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో పాల్గొని 25వ సారి రక్తదానం చేశారు. ఈమేరకు రాజశేఖర్‌కు జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మనోజ్‌లాల్, వైద్య విధాన పరిషత్ జిల్లా అధికారి డాక్టర్ గోపాల్ సర్టిఫికెట్ అందించగా డాక్టర్లతో కలిసి శాలువా కప్పి రాజశేఖర్‌ను జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి తక్కళ్ళపల్లి రవీందర్‌రావు సన్మానించి అభినందించారు.

• ఖానాపురం: రాగంపేటకు చెందిన కన్నె రాజు2005 నుంచి నేటి వరకు 34 సార్లు రక్త దానం చేశారు. ఈ మేరకు బ్లడ్ డోనర్ అవార్డును శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌చే అందుకున్నారు. వరంగల్ పోలీసు కమిషనరేట్‌లో సిటీ ఆర్మ్ రిజర్వులో ఏఆర్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. దీంతో ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా రాజును రాష్ట్ర రెడ్ క్రాస్ సంస్థ అవార్డుకు ఎంపిక చేశారు.

• నర్సంపేట టౌన్: అంతర్జాతీయ రక్తదాతల దినోత్సవం సందర్భంగా నర్సంపేట పట్టణంలోని డఫోడిల్స్ పాఠశాల చైర్మన్ చింతల నరేందర్ శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ సి.పి.రాధాకృష్ణ, మంత్రి పొన్నం ప్రభాకర్‌ల చేత సన్మానం, ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.డఫోడిల్స్ పాఠశాల ఫౌండర్, దివంగత శకుంతల నాయర్ (అరుణ) జ్ఞాపకార్థం పదేళ్లుగా నరేందర్ రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నారు. నరేందర్ కృషిని గుర్తించిన ప్రభుత్వం సన్మానించింది. సన్మానించిన వారిలో గవర్నర్ రాధాకృష్ణతోపాటు మంత్రులు ప్రభాకర్, దామోదరరాజనర్సింహలు ఉన్నారు. అనంతరం పాఠశాలకు చేరుకున్న నరేందర్‌ను సిబ్బంది ఘనంగా సన్మానించారు.

ఘనంగా చేగువేరా జయంతి



నెక్కొండలో చేగువేరాకు నివాళులర్పిస్తున్న నాయకులు

నర్సంపేట, జూన్ 14 : ప్రపంచ దేశాలలో శాంతి, సౌభ్రాతృత్వం కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన ప్రపంచ విప్లవకారుడు, రచయిత చే గువేరా జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా జన్ను రమేశ్, డివిజన్ కార్యదర్శి మార్త నాగరాజు పిలుపునిచ్చారు. పట్టణంలోని సంఘ కార్యాలయంలో చే గువేరా జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ రచయిత, డాక్టర్, రాజకీయ వేత్తగా ప్రపంచదేశాల ప్రజలకు సేవలందించారన్నారు. కార్యక్రమంలో రాకేశ్, అజయ్, అజిత్ పాల్గొన్నారు. అలాగే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చే గువేరా జయంతి వేడుకలను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఏఐఎస్ఎఫ్ జిల్లా దిడ్డి పార్థసారథి పూలమాల వేయగా, నాయకులు బానోతు స్టాలిన్, గణేశ్, శ్యామల, సాయికృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

• నెక్కొండ : సామ్రాజ్య వాదుల గుండెల్లో సింహ స్వప్నం విప్లవకారుడు చే గువేరా అన్ని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పంజాల రమేశ్ అన్నారు. నెక్కొండలోని పనికర క్రాస్ రోడ్డులో శుక్రవారం చే గువేరా 96 జయంతి వేడుకలను సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శ సభ్యులు అక్కలల్లి రమేశ్, నెక్కొండ మండల కార్యదర్శి కందిక చెన్నకేశవులు, నాయకులు గోవర్ధన్‌చారి, ఎల్లస్వామి, దేవపాల, యాకయ్య, వెంకటలక్ష్మి, రమ, సరిత, సుగుణమ్మ, ప్రవీణ్, రాజేశ్, శ్రీలక్ష్మి, రమేశ్, రజిత , సావిత్రి, ఉపేంద్ర, నర్సయ్య, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.


ఎన్ఎంఎంఎస్‌లకు మోడల్ విద్యార్థులు



లోహిత పాఠశాలలో విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం, టీచర్లు

సంగెం, జూన్ 14 : మండలంలోని గవిచర్ల మోడల్‌స్కూల్ విద్యార్థులు చందన, రిషిత, వర్షిక్ అనే విద్యార్థులు ఇటీవల నిర్వహించిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షలో ప్రతిభ కనబరిచి జాతీయ స్కాలర్‌షిప్‌లకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రహేమాన్ ముజుఫర్ తెలిపారు. విద్యార్థులను ఏఏపీ చైర్మన్ గోనె రాధిక, ప్రిన్సిపాల్, అధ్యాపకులు శుక్రవారం అభినందించారు. లోహిత జెడ్పీ పాఠశాల విద్యార్థులు కోల సింధూజ, దేవ మేఘన కూడా ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైనట్లు హెచ్ఎం నూకల అంజివర్ధన్‌రెడ్డి తెలిపారు. ఇదేపాఠశాల విద్యార్థి వంశీమోహన్ తయారుచేసిన ఎగ్జిబిట్ రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైనట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దుర్గారావు, ఏఏపీ చైర్మన్ ఆకల దీపిక పాల్గొన్నారు.

ఎంపీ కడియం కావ్యను కలిసిన ఎంపీడీవో



ఎంపీ కావ్యకు పూలబొకేను అందజేస్తున్న ఎంపీడీవో శంకర్‌నాయక్

పర్వతగిరి, జూన్ 14 : వరంగల్ ఎంపీ కడియం కావ్య, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిలను శుక్రవారం హన్మకొండలోని ఆమె స్వగృహంలో పర్వతగిరి ఎంపీడీవో శంకర్‌నాయక్‌తో పాటు ఏపీవో సుశీల్‌కుమార్, సూపరింటెండెంట్ అయేషా పర్వీన్లు మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ఎంపీ కడియం కావ్యకు స్వీట్‌ను, పూలబొకేను అందజేసి శుభాకాంక్షలను తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది రాంప్రసాద్, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎంపీ స్వగృహంలోనే యూత్ కాంగ్రెస్ నాయకులు కందికట్ల అనిల్, పూల్లూరి దిలీప్‌గౌడ్, బొక్కల ప్రమోద్, రాజేష్, వంశీలు ఎంపీ కడియం కావ్యకు పూల బొకేను అందజేసి, శుభాకాంక్షలను తెలియజేశారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

గీసుగొండ, జూన్ 14 : మండలంలోని ధర్మారం జెడ్పీ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్‌తోపాటు సభ్యులు శుక్రవారం పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు రుచికరమైన, నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు. కార్యక్రమంలో చైర్మన్ రాధిక, సభ్యులు రమ, లావణ్య, గౌతమి, ఉపాధ్యాయులు కుమా రస్వామి, సూరయ్య, మాజీ కోఆప్షన్ సభ్యుడు శ్రీకాంత్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రేగొండ, జూన్ 14: ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని రంగయ్యపల్లి గ్రామ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని ముంచింపుల గ్రామానికి చెందిన పులి రవి(63) గోదావరిఖనికి వెళ్లి తిరిగి వస్తుండగా రంగయ్యపల్లిలోని మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో ద్విచక్ర వాహనంపై ఉన్న పులి రవి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయన భార్య ప్రేమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రవికుమార్ తెలిపారు.

అడ్డగోలు తవ్వకాలకు అడ్డుకట్ట!

(5వ పేజీ తరువాయి)

సదరు యజమానులకు తవ్విన ఖనిజాలకు రాయల్టీ చెల్లించాలని నోటీసులు జారీ చేసి ఆ మేరకు వసూలు చేస్తారు. దీంతో ప్రభుత్వానికి ప్రస్తుతం వస్తున్న ఆదాయం కన్నా రెట్టింపు సమకూరే అవకాశం ఉందని గనుల శాఖ అధికారులు చెబుతున్నారు.

డీజీపీఎస్, ఈటీఎస్ సర్వే అంటే..

డీజీపీఎస్, ఈటీఎస్ సర్వేలు అనేవి ఒక మెరుగైన, కచ్చితత్వాన్ని అందించే విధానం. గనుల్లో క్వారీలు జరుగుతున్న ప్రాంతాల్లో ఈ సర్వేలను ప్రధానంగా నిర్వహిస్తారు. గనుల శాఖ అధికారులే కాకుండా గనుల శాఖలోని విజిలెన్స్ కూడా ఈ సర్వేలను నిర్వహిస్తుంది. ఈ సర్వేలో భాగంగా డేటా కాడాస్ట్రల్ మ్యాప్‌లను డిజిటలైజ్ చేస్తారు. భూమి లక్షణాలను విజువలైజ్ చేస్తారు. ఈ సర్వేల ద్వారా విలువైన ప్రాదేశిక సమాచారం అధికారులకు అందుతుంది. డీజీపీఎస్ సర్వే ద్వారా క్వారీ జరుగుతున్న ప్రాంతాన్ని కచ్చితంగా కొలుస్తుంది. సాధారణ జీపీఎస్ 15 మీటర్ల నుంచి 10 సె.మీ. వరకు కచ్చితంగా గుర్తిస్తుంది.

గుండెపోటుతో మాజీ సర్పంచ్ మృతి



సాంబయ్య (ఫైల్)

దుగ్గొండి, జూన్ 14 : మండలంలోని పొనకల్ గ్రామ మాజీ సర్పంచ్ ఇటికాల సాంబయ్య (63) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందాడు. సాంబయ్య 2006 నుంచి 2011 వరకు ఏకగ్రీవంగా ఎంపికై సర్పంచ్‌గా కొనసాగారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు..

దుగ్గొండి, జూన్ 14 : మానసికస్థితి బాగాలేక జీవితంపై విరక్తిచెంది పురుగుల మందు తాగి చికిత్సపొందుతూ వృద్ధు రాలు మృతిచెందిన సంఘటన మండలంలోని కేశవాపురంలో శుక్రవారం జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... కేశవాపురం గ్రామానికి చెందిన చల్లా జయమ్మ (68) గత 25ఏళ్ల నుంచి మానసిక వ్యాధితో బాధ పడుతోంది. మూడు నెలల కిందట వెన్ను నొప్పిరాగా, ఆపరేషన్ చేయించ గా, ఆపరేషన్ విజయవంతం కాలేదు. దీంతో జయమ్మ నడువ లేని స్థితిలో ఉండిపోయింది. కుటుంబ సభ్యులు వ్యవసాయ పనులకు పోయిన తర్వాత ఇంటిలో పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు చికిత్సకోసం వరం గల్‌లోని ఎంజీఎంకు తీసుకొనిపోగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్సై పరమేశ్ తెలిపారు. మృతిరాలు కుమారుడు చల్లా మోహన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు. మృతురాలికి ముగ్గురు కుమారులు ఉన్నారు.

దూసుకొచ్చిన కారు.. తప్పిన ప్రమాదం

దుగ్గొండి, జూన్ 14 : మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం కారు అదుపు తప్పి ఇళ్లపై దూసుకొచ్చి మెట్లకు ఢీకొట్టి ఆగిపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. గ్రామస్థుల కథనం ప్రకారం... మండంలోని నాచినపల్లికి చెందిన కారు దుగ్గొండికి వస్తున్న క్రమంలో అతివేగంగా నడుపడంతో అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న రెండు బైకులకును ఢీకొట్టి మీసీ బ్యాంక్ ఎదుట ఉన్న మెట్లకు గుద్దుకొని నిలిచిపోయింది. బైకులు ధ్వంసంతో పాటు కారు ముందు భాగం ధ్వంసమైంది. ఎవరికీ ఏమి కాలేదు. స్థానిక పోలీసులు చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలికి పాము కాటు



చికిత్సపొందుతున్న ఎల్లమ్మ

వర్ధన్నపేట రూరల్, జూన్ 14 : మండలంలోని దమ్మన్నపేటలో గురువారం రాత్రి మేరుగు ఎల్లమ్మ అనే 62 ఏళ్ల వృద్ధురాలిని పాము కాటువేసింది. దీంతో వెంటనే స్థానికులు వర్ధన్నపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కరిచిన పామును చూసి వైద్యులు వైద్యం చేస్తారనే ఆలోచనతో పామును సైతం పట్టుకుని ఆస్పత్రికి రావడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. గురువారం రాత్రి ఇంటి ముందు అరుగుపై కూర్చున్న ఎల్లమ్మను కట్ల పాము కాటు వేసింది. దీంతో వెంటనే ఆస్పత్రికి వెళ్లగా వైద్యులు వెంటనే చికిత్సచేశారు. కాటు వేసిన పామును చూసి సరైన వైద్యం అందిస్తారని భావించిన స్థానికులు సంచిలో పామును తీసుకుని రావడంతో ఒక్కసారిగా అవాక్కయ్యారు. ప్రస్తుతం ఎల్లమ్మ ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. గత కొన్ని నెలల క్రితం సైతం మండలంలోని బండౌతపురం గ్రామంలో సైతం గొర్ల కాపరిని ఇలానే పాము కరవగా, వారు కూడా పామును వెంట తీసుకుని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి వెళ్లి, అనంతరం రాయపర్తిలోని కొండాపురం వెళ్లి నాటు వైద్యం చేయించుకున్నారు.

సమన్వయంతో పనిచేసి సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగరాజు

వర్ధన్నపేట, జూన్ 14 : ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి వర్ధన్నపేట నియోజకవర్గ సమస్యలను పరిష్కరించాల ని ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వర్ధన్నపేట నియోజకవర్గ వివిధ శాఖల అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానిక సమస్యలను గుర్తిం చడంతోపాటు ప్రజలకు ఇబ్బందులు కలిగించే వాటిని తక్షణమే పరిష్కరించాలని కోరారు. పనుల కోసం భారీగా నిధులు అవసరమైతే తాను ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను అందిస్తానన్నారు.

విద్యా హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

నల్లబెల్లి, జూన్ 14 : విద్యా హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా కార్యదర్శి జన్ను రమేష్ తెలిపారు. శుక్రవారం మండల విద్యాశాఖ సిబ్బందికి వినతిపత్రాన్ని ఇచ్చి ఎంఈవోకు అందజేయాలని కోరారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలన్నారు. గుర్తింపులేని ప్రైవేట్ పాఠశాలలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం బట్టలు, పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు అందజేయాలన్నారు. ప్రభుత్వ బడిలో అన్ని రకాల మౌలిక వసతులను కల్పించాలన్నారు. అలాగే ప్రైవేట్ బడుల బస్సులకు పర్మిట్‌లులేకుంటే వెంటనే సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి మార్త నాగరాజు పాల్గొన్నారు.

సుద్దరేవుల ఆనకట్టపై బ్రిడ్జి నిర్మాణ పనులను చేపట్టాలి



పాపయ్యపేటలోని సుద్దరేవుల ఆనకట్ట వద్ద రైతులు

చెన్నారావుపేట, జూన్ 14 : మండలంలోని పాపయ్యపేటలో పాకాల వాగుపై నిర్మాణం చేసిన సుద్ద రేవుల ఆనకట్టపై బ్రిడ్జి నిర్మాణ పనులను చేపట్టాలని ఆయకట్టు రైతులు డిమాండ్ చేస్తున్నారు.శుక్రవారం గ్రామ రైతులు. గ్రామస్థులు కలిసి సుద్దరేవుల ఆనకట్టను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ సుద్దరేవుల ఆనకట్టపై బ్రిడ్జి నిర్మాణం లేకపోవటంతో రైతులు. వ్యవసాయ కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సుమారు 45కిలో మీటర్ల వర్షాకాలంలో తిరిగి వెళ్లి వ్యవసాయ పనులు చేసుకొనే పరిస్థితి నెలకొందన్నారు. ప్రతీ సంవత్సరం వర్షాకాలంలో వాగు దాటుతూ కూలీలు మృత్యువాత పడుతున్నారన్నారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చొరవ తీసుకొని బ్రిడ్జి నిర్మాణ పనులను చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు కత్తి స్వామి గౌడ్, బండి రమేష్ గౌడ్, వీరస్వామి, కోరే అశోక్, బుర్రి వీరాస్వామి, అన్న కొంరయ్య, చెన్నూరి సాంబయ్య, రవి, కుండె శ్రీశైలం, మండల రవి తదితరులు పాల్గొన్నారు.